ఓటరు జాబితాలో పేర్ల తొలగింపుపై విచారణ

● ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు



ప్యారీస్, మే 2: లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటరు జాబితాలో పేర్లు తొలగించినట్లు అందిన ఫిర్యాదుపై విచారణకు ఆదేశించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి సత్యప్రదసాహు ప్రకటించారు. రాష్ట్రంలో గత నెల 19న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కోవై జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన ప్రజలకు ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడంతో దిగ్భ్రాంతికి గురై ఆందోళన కూడా చేపట్టారు. ఈ వ్యవహారంపై కోవై జిల్లా ఎన్నికల అధికారుల తరఫున ఎన్నికల సంఘానికి వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ బీజేపీకి అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లను ఉద్దేశపూర్వకంగా జాబితా నుంచి తొలగించారని మీడియా ముందు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, నగరంలోని సచివాలయంలో గురువారం సత్యప్రదసాహు మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు ముగిశాయని, ఈవీఎం, వీవీ ప్యాడ్‌లు భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద 24 గంటల పోలీసు భద్రత కొనసాగుతోందని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించినట్లు అందిన ఫిర్యాదులపై సంబంధిత జిల్లా ఎన్నికల అధికారుల వద్ద కానీ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో ఫిర్యాదు అందజేస్తే వాటిని సంబంధిత జిల్లా అధికారులకు పంపించి చర్యలు తీసుకుంటామన్నారు. పేర్లు చేర్చేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా, ప్రత్యేక శిబిరాల్లో దరఖాస్తు సమర్పించినా పరిశీలించి అర్హులైన వారిని జాబితాలో చేర్చడం, అలాగే జాబితాలోని మృతుల పేర్ల తొలగింపుకు చర్యలు చేపడతామన్నారు. ఓటరు జాబితాతో ఆధార్, సెల్‌ఫోన్ నెంబరు అనుసంధానానికి సంబంధించిన న్యాయస్థానం పలు సూచనలు ఇచ్చిందని, ఈ అంశంపై కూడా పరిశీలిస్తున్నట్లు సత్యప్రదసాహు తెలిపారు.

జూన్ రెండోవారంలో అసెంబ్లీ సమావేశాలు?



చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వార్షిక బడ్జెట్ అనుబంధ ఆర్థిక పద్దులపై చర్చించేందుకు వచ్చే జూన్ రెండో వారంలో శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ యేడాదికి సంబంధించి తొలిసారిగా శాసనసభ సమావేశాలు ఫిబ్రవరి 12న ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో గవర్నర్ ఆర్ఎన్ రవి హాజరై ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని కొద్ది సేపే చదివి వివాదం రేపారు. ప్రభుత్వం రూపొందించిన ప్రసంగం పాఠంలోని కొన్ని అంశాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయంటూ ఆరోపించారు. తాను ప్రసంగం ప్రారంభించడానికి ముందు జాతీయ గీతం వినిపించాలని చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం గర్హనీయమన్నారు. ఆ తర్వాత స్పీకర్ అప్పావు గవర్నర్ ప్రసంగాన్ని చదివి వినిపించారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఆ సమావేశాల్లోనే వ్యవసాయ బడ్జెట్, ఆర్థిక బడ్జెట్ దాఖలయ్యాయి. రెండు బడ్జెట్‌లపైనా సభలో సమగ్రంగా చర్చ జరిగింది. అదే సమయంలో కొన్ని చట్టసవరణకు సంబంధించిన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఆ తర్వాత సభ నిరవధికంగా వాయిదాపడింది. లోకసభ ఎన్నికల నోటిఫికేషన్ జారీకావడంతో ఆ తరువాత శాసనసభ సమావేశాలు జరగలేదు. దీంతో ఆర్థిక అనుబంధ పద్దులను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించలేకపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకే విడతగా లోక్‌సభ ఎన్నికలు ముగిసినా వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు విడతల వారీగా జూన్ ఒకటి వరకు కొనసాగుతుండటంతో అప్పటివరకూ కోడ్ అమలులో ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ కారణంగా ఈ నెలలో శాసనసభ సమావేశాలు నిర్వహించలేకపోతున్నట్లు స్పీకర్ అప్పావు ఇదివరకే ప్రకటించారు. జూన్ నాలుగన లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనుండటంతో అదే నెల రెండో వారంలో శాసనసభ సమావేశాలు జరిపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆ దిశగానే ప్రస్తుతం సచివాలయంలో శాసనసభ సమావేశాలు నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మహిళలకు మరో బంపర్ ఆఫర్

● ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం ?

● సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం కసరత్తు

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మరో తీపి కబురు చెప్పేందుకు డీఎంకే ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే మహిళకు ఉచిత ప్రయాణ సదుపాయ కల్పించిన స్టాలిన్ ప్రభుత్వం.. మున్ముందు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తే ఎలా వుంటుందన్నదానిపై ఆలోచిస్తోంది. ఇదే జరిగితే త్వరలోనే మహిళలు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం చేయడం ఖాయం. 2021 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో నగర ప్రాంత బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని డీఎంకే హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో డీఎంకే విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్టాలిన్.. నగర ప్రాంత బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణించే ఫైలుపై సంతకం చేశారు. ఆ ప్రకారం, చెన్నై సహా అన్ని నగరాల్లో మహిళలు ఆర్డినరీ (వైట్‌బోర్డు) బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో వైట్ బోర్డు బస్సులను మహిళలు గుర్తించేలా బస్సు వెనుక, ముందు భాగాల్లో 'పింక్' రంగు పూశారు. ఈ రంగు ఉన్న బస్సుల్లో 'మహిళలకు ప్రయాణం ఉచితం' అనే స్టిక్కర్లు అంటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 49 లక్షల మంది మహిళలు ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నట్లు రవాణా శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

'పింక్' బస్సుల్లో రద్దీ...

రాష్ట్ర రాజధాని నగరంలో మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీసీ) ఆర్డినరీ బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు, డీలక్స్ బస్సులు, ఏసీ బస్సులు నడుపుతోంది. ఎంటీసీలో మొత్తం 3,233 బస్సులుండగా, వాటిల్లో 1,600 బస్సులు పింక్‌గా మారాయి. వాటిల్లో మహిళలకు ఉచిత ప్రయాణం. కాగా ఆర్డినరీ బస్సుల్లో చార్జీలు తక్కువగా ఉండడంతో పురుషులు కూడా అధిక సంఖ్యలో వాటినే ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆయా బస్సులు నిత్యం రద్దీగా నడుస్తున్నాయి. అదే సమయంలో ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య తక్కువగా ఉండడంతో ఆ బస్సులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

నివేదిక తయారీ ప్రారంభం...

ఈ విషయమై రవాణా శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ... సాధారణ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగిందన్నారు. ఈ సదుపాయాన్ని ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులకు విస్తరించాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ఎంతమంది మహిళలు ప్రయాణిస్తున్నారన్నదానిపై బేరీజు వేస్తున్నామని, బ్రాడ్‌వే, తాంబరం, గుడువాంజేరి, కిలంబాక్కం, తిరువాన్మియూర్, తిరువొత్తియూర్, పూందమల్లి, షోలింగనల్లూర్ తదితర ముఖ్యమైన మార్గాల్లో ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య లెక్కిస్తున్నామన్నారు. రెండు నెలలు వరకు లెక్కిస్తామన్నారు. అలాగే, సాధారణ బస్సుల్లో ఎంతమంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారన్న విషయాన్ని, వారికిచ్చే టిక్కెట్ల ద్వారా లెక్కింపు జరుగుతోందన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ పథకం పెడితే ఆ బస్సుల సంఖ్య పెంచడం వంటి వాటిపైనా అంచనా వేస్తున్నామన్నారు. ఇవన్నీ పూర్తి చేసి ముఖ్యమంత్రికి నివేదిక అందజేస్తామని, ఆ తరువాత ఆయన దానిపై నిర్ణయం తీసుకుంటారని వివరించారు. ఈ పథకం అమలులోకి వచ్చేందుకు ఐదారు నెలలు పడుతుందన్నారు.

మంచి స్పందన

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం పట్ల మంచి స్పందన వస్తోంది. తమిళనాడులో ఈ పథకం విజయవంతమవ్వడంతో అటు ఆంధ్రాలో టీడీపీ కూడా ఈ పథకాన్ని తన మేనిఫెస్టోలో చేర్చింది. ఇక తెలంగాణ అయితే ఇప్పటికే ఈ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే తమకు కేవలం ఆర్డినరీ బస్సు ప్రయాణమేనా, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే అదృష్టం లేదా అంటూ పలువురు మహిళలు ముఖ్యమంత్రికి విజ్ఞప్తులు పంపుతున్నారు. నిజానికి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణంపై గత కొంతకాలంగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక స్థితిపై అంచనాకు వచ్చాక దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాలని భావించింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఉచిత ప్రయాణాన్ని ఎక్స్‌ప్రెస్ బస్సుల వరకు పొడిగించడంపై సాధ్యాసాధ్యాలపై సమీక్షించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది.

లాహిరి..లాహిరి.. లాహిరిలో..

● సీఎం స్టాలిన్ దంపతుల బోట్ సవారీ

ప్యారీస్, మే 2: ఎన్నికల అనంతరం విశ్రాంతి తీసుకునేందుకు దిండుగల్ జిల్లా కొడైకెనాల్ వెళ్లిన ముఖ్యమంత్రి స్టాలిన్ కుటుంబం.. అక్కడ సరదాగా గడుపుతోంది. మూడు రోజుల క్రితం అక్కడకు వెళ్లిన స్టాలిన్.. తొలిరోజు సాయంత్రం గోల్ఫ్ మైదానానికి వెళ్లి అక్కడ క్రీడాకారులతో కలసి గోల్ఫ్ ఆడారు. ఆయన సతీమణి దుర్గా స్టాలిన్ బుధవారం పూంపారై కొండ గ్రామంలోని ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం కొడైకెనాల్ నగరంలో ఉన్న సరస్సుకు కుటుంబంతో వెళ్లిన స్టాలిన్.. పడవలో గంట సేపు సవారీ చేశారు. అప్పుడు నక్షత్ర ఆకారంలో ఉన్న ఆ సరస్సు ప్రత్యేకత గురించి పర్యాటకశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి దంపతులతో పర్యాటకులు, స్థానికులు సెల్ఫీ దిగారు.



బోట్ సవారీలో దుర్గా స్టాలిన్



రాళ్ల క్వారీలో మృతదేహాలు వెలికితీసేందుకు వెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది

రెండు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

● నీట మునిగి ముగ్గురు

● రోడ్డు ప్రమాదంలో మరో ముగ్గురు



రోడ్డు ప్రమాదంలో మృతులు

పెరంబూర్, మే 2: రాష్ట్రంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు యువకులు దుర్మరణం చెందారు. చెంగల్పట్టు జిల్లాలో నీట మునిగి ముగ్గురు, మైలాడుదురై జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో ముగ్గురు మృతి చెందారు. వివరాలిలా...

చెంగల్పట్టు జిల్లాలో....

రాళ్ల క్వారీలో స్నానానికి వెళ్లి ముగ్గురు యువకులు మృతిచెందిన ఘటన చెంగల్పట్టు జిల్లాలో చోటు చేసుకుంది. కాట్టాన్‌కొళత్తూర్ యూనియన్ కీరపాక్కం పంచాయతీలోని రాళ్ల క్వారీని పదేళ్ల క్రితం మూసివేశారు. నందివరం సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో స్నానాలు చేసేందుకు రాళ్ల క్వారీకి వెళ్లారు. వారిలో తిరుప్పూర్‌కు చెందిన దీపక్‌సారథి (20), తంజావూరుకు చెందిన మహమ్మద్ ఇస్మాయిల్, ధర్మపురికి చెందిన విజయ్‌సారథి (19) నీటిలో మునిగిపోయారు.. గట్టుపై ఉన్న ఇద్దరు వేసిన కేకలతో అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది క్వారీలో గాలించి విజయసారథి మృతదేహం వెలికితీశారు. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలు నిలిపివేసిన సిబ్బంది, గురువారం ఉదయం క్వారీ నుంచి మరో ఇద్దరి మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మైలాడుగురై జిల్లా లో...

మైలాడుగురై జిల్లా తరంగంబాడిలో ఒకే బైక్‌పై వెళ్లిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తరంగంబాడిలో నివసిస్తున్న కడలూరు జిల్లాకు చెందిన మహమ్మద్ షకీల్, ఆకాష్, హరి బుధవారం నాగపట్టణంలో జరిగిన బంధువుల ఇంటి వివాహ వేడుకల్లో పాల్గొని, గురువారం ఉదయం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ముగ్గురూ బైక్‌పై తరంగంబాడి సమీపంలో వస్తుండగా, శ్రీధర్ నడుపుతున్న స్కూటర్‌ను ఢీకొని ముగ్గురు కిందపడి పోయారు. అదే సమయంలో వెనుకనుంచి వచ్చిన ట్రాక్టర్ ముగ్గురిపైకి దూసుకెళ్లింది. దీంతో ఆ ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ప్రమాదంలో కింద పడిన శ్రీధర్ తీవ్రంగా గాయపడడంతో చుట్టుపక్కల వారు మైలాడుదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

● నకిలీ స్టిక్కర్లున్న వారికి జరిమానా



ఎగ్మూరులో నకిలీ స్టిక్కర్లతో తిరిగిన వారికి జరిమాన విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసులను తప్పుదోవపట్టించేలా నెంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు అంటించుకుని తిరిగే వారికి పోలీసులు ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. ఇటీవల కాలంలో నగరంలో నెంబర్ ప్లేట్లమీద లాయర్లు, ప్రెస్, గవర్నరమెంట్ వాహనాలని తెలిపేలా స్టిక్కర్లు అంటించుకుని వాహన చోదకులు, పాత నేరస్థులు ట్రాఫిక్ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నారనే సమాచారంతో మే ఒకటి నుంచి ఇలాంటి స్టిక్కర్లున్న వాహనాలకు జరిమానా విధిస్తామని ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఆ మేరకు నగరమంతటా గురువారం ఉదయం వంద చోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. నెంబర్ ప్లేట్లపై స్టిక్కర్లతో తిరిగిన వాహనచోదకులకు స్పాట్‌ఫైన్ రూ.500 విధించారు. రెండోసారి నకిలీ స్టిక్కర్లతో తిరిగితే వాహన చోదకులకు రూ.1500 వరకు జరిమానా విధిస్తామంటూ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. టి.నగర్ బర్కిట్‌రోడ్డు, జీఎన్ చెట్టి రోడ్డు, ఎగ్మూరు రైల్వేస్టేషన్ కూడలి, పూందమల్లి హైరోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేసి నకిలీ స్టిక్కర్లతో తిరిగేవారిని పట్టుకుని జరిమానా విధించారు.

జర్నలిస్టులకు మినహాయింపు...

ప్రభుత్వ గుర్తింపు కార్డులు కలిగిన పాత్రికేయులు, లాయర్లు, డాక్టర్లు నెంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు అతికించి వాహనాలను నడపవచ్చని, వారికి ఎలాంటి జరిమానా ఉండదని ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. స్టిక్కర్ల విషయంలో జర్నలిస్టులు, లాయర్లు, డాక్టర్లకు మినహాయింపు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

విషాదాన్ని నింపిన ప్రయాణం

● రోడ్డు ప్రమాదంలో మామతో కలిసి అసువులు బాసిన మేనల్లుడు



మృతిచెందిన డ్రైవర్ విజయ్, తమిద్‌మారన్



లారీని ఢీకొన్న ఐచర్

పెనుకొండ రూరల్, మే 2: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలో గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న సిమెంటు లారీని ఐషర్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో బాలుడి సహా ఇద్దరు మృత్యువాత పడ్డారు. వివరాలిలా... తమిళనాడులోని తిరువన్నామలైకి చెందిన తమిద్‌మారన్ ఆరో తరగతి చదువుతున్నాడు. బడికి వేసవి సెలవులిచారు. అతడి మేనమామ విజయ్ క్యాంటర్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సరుకు రవాణా కోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాడు. మేనల్లుడికి మామ వెంట వెళ్లి ఊళ్లన్నీ తిరగాలనిపించింది. 'మామా.. మామా.. నేనూ వస్తా నీ వెంట..' అని అడిగాడు. బహుశా తను.. 'వద్దురా.. ఎండలకు తట్టుకోలేవు..' అని సముదాయించి ఉంటాడు. కానీ ముద్దుల మేనల్లుడు బుంగమూతి పెట్టగానే.. చెల్లెకి నచ్చజెప్పి వెంట తీసుకుని వెళ్తుంటాడు. అలా బయలుదేరిన వారి ప్రయాణం.. అమరపురి దాకా కొనసాగింది. అత్యంత విషాదకరంగా మేనల్లుడు, మేనమామ మృత్యువాత పడ్డారు. గుట్టూరు సమీపంలో ఆగి ఉన్న సిమెంటు లారీని వారి క్యాంటర్ వాహనం ఢీకొట్టింది. 44వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘోర ప్రమాదంలో డ్రైవర్ విజయ్(29), అతని మేనల్లుడు తమిద్‌మారన్(11) మృతిచెందారని కియ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపారు. క్యాంటర్ వాహనంలో తిరువన్నామలై నుంచి పండ్లను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లి అన్‌లోడ్ చేశారు. అక్కడి నుంచి స్క్రాప్ తీసుకుని బెంగళూరుకు బయలుదేరాడు. గుట్టూరు సమీపంలోకి రాగానే వేకువజామున జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న సిమెంటు లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు గురువారం రాత్రికి పెనుకొండ చేరుకున్నారు. ఇద్దరి మృతితో ఆ కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

ఫేస్‌బుక్‌లో పరిచయాలు

● ఇంటికి రమ్మంటూ ఆహ్వానాలు

● ఆపై కిడ్నాప్, దోపిడీ

● పారిశ్రామికవేత్తలను మోసగించిన కి'లేడీ' అరెస్ట్



అరెస్టయిన రంజిత్, సుడలై, భానుమతి

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆమె ఫేస్ బుక్ ద్వారా బడాబడా పారిశ్రామికవేత్తలతో పరిచయం పెంచుకుంటుంది.. అది కాస్తా స్నేహంగా మలచి తన ఇంటికి 'ఆతిథ్యానికి' ఆహ్వానిస్తుంది. తీరా వచ్చాక వారిని బంధించి నగలు, నగదు లాగేసుకుంటుంది. ఇలా 50 మందికి పైగా పారిశ్రామికవేత్తలను దోచుకున్న ఓ కి'లేడీ' ఎట్టకేలకు కటకటాల పాలైంది. ఆమే పాళయంకోటకు చెందిన భానుమతి (40). ఎప్పటిలానే ఓ పారిశ్రామికవేత్తను మోసగించే ప్రయత్నంలో పోలీసులకు పట్టుబడిన ఆ మహిళకు సంబంధించిన వివరాలిలా...

సేలం జిల్లా అయ్యన్‌పెరుమాళ్‌పట్టి ప్రాంతానికి చెందిన నిత్యానందం (47) అనే విండ్ మిల్స్ పరికరాల టోకు వ్యాపారవేత్తతో పాళయం కోట పెరుమాళ్‌పురం ఎన్జీవో కాలనీకి చెందిన భానుమతికి మూడు నెలల క్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో భానుమతి తన ఇంటికి ఆహ్వానించింది. ఆ మహిళ మాటలను నమ్మి తిరునల్వేలికి వెళ్ళిన నిత్యానందంకు చేదు అనుభవం ఎదురైంది. భానుమతి తెలిపిన చిరునామాలో ఉన్న ఇంటికి వెళ్ళినప్పుడు భానుమతి, ఆమె మగమిత్రులు ఐదుగురు కలిసి ఆయన్ని బంధించారు. భానుమతిపై అత్యాచార యత్నానికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసి అవమానాలపాలు చేస్తామని బెదిరించారు. అంతటితో ఆగకుండా ఆయన దగ్గరున్న రూ.10లక్షలు, నగలను దోచుకున్నారు. ఆలా నిలువుదోపిడీకి గురైన నిత్యానందం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భానుమతి గుట్టు రట్టయ్యింది. భానుమతి చెన్నై, కాంచీపురానికి చెందిన పారిశ్రామికవేత్తలు సహా సుమారు 50 మందిని మోసగించి నగలు, నగదు అపహరించినట్లు వెల్లడైంది. భానుమతికి పదేళ్లకు ముందు ఆళ్వార్‌తిరునగరి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో వివాహమైందని, ఆమెకు ఓ కుమారుడు, కుమార్తె కూడా ఉన్నారని, ఆమె ప్రవర్తన నచ్చకపోవడంతో భర్త, పిల్లలు ఆమెను విడిచి పెట్టి వెళ్ళారని తెలిసింది. ఆ తర్వాత భానుమతికి చిన్ననాటి మిత్రుడు వెల్లైదురై (42)తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. గత ఏడేళ్లుగా అతడితో సహజీవనం చేస్తోంది. ఇద్దరూ విలాసవంతంగా గడిపేందుకు లక్షలాది రూపాయలను అక్రమ మార్గంలో సంపాదించాలని వ్యూహం పన్నారు. తమ మోసాలకు పార్థసారథి, రంజిత్, సుడలై అనే వారి సాయం తీసుకున్నారు. భానుమతి ఫేస్‌బుక్‌లో పారిశ్రామికవేత్తలను, కోటీశ్వర్లను టార్గెట్‌గా చేసుకుని వారితో పరిచయం పెంచుకుంటూ ఉల్లాసంగా గడుపుదామని రమ్మంటూ తిరునల్వేలికి ఆహ్వానించి తన సహచరులతో కలిసి వారిని కిడ్నాప్ చేసి, బెదరించి లక్షలాదిరూపాయలను దోచుకునేది. ఏడేళ్లుగా భానుమతి ఇలా చెన్నై, కాంచీపురం ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారులను టార్గెట్‌గా చేసుకుని మాయమాటలతో వారిని బోర్లా కొట్టించి నగలు, నగదు దోచుకుందని పోలీసుల విచారణలో వెల్లడైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని భానుమతితో పాటు ఆమె అనుచరులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఆమె సన్నిహితుడు పార్థసారథి ఆచూకీకోసం తిరునల్వేలి పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

సమాచార దర్శిని

14 వరకు కుటుంబ సంక్షేమ కోర్టులకు సెలవు

ఐసిఎఫ్, మే 2: తమిళనాడు, పుదుచ్చేరిలో ఉన్న కుటుంబ సంక్షేమ కోర్టులకు ఈ నెల 14వ తేది వరకు సెలవులు ప్రకటించారు. ఈ సెలవు దినాల్లో కోర్టుల కార్యాలయాలు యధావిధిగా పనిచేస్తాయని మద్రాసు హైకోర్టు ప్రధాన రిజిస్ట్రార్ జ్యోతిరామన్ తెలిపారు.

డేటా సైన్స్ చదివిన వారికి ఉద్యోగావకాశాలు

ఐసిఎఫ్, మే 2: డేటా సైన్స్ చదివిన 2,500 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెన్నై ఐఐటీ తెలిపింది. నాలుగేళ్ల ఈ కోర్సును 2020లో పరిచయం చేశారు. కళాశాల విద్యార్థులు, కార్యాలయాల్లో పనిచేసే వారు దేశవ్యాప్తంగా ప్రస్తుతం 27,000 మందికి పైగా విద్యార్థులు ఈ కోర్సును చెన్నై ఐఐటీలో చదువుతున్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన 2,500 మంది విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందినట్లు ఐఐటీ తెలిపింది. మరి కొందరు విదేశాల్లోనే వివిధ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యలో చేరినట్లు పేర్కొంది.

5న కోయంబేడు మార్కెట్‌కు సెలవు

ఐసిఎఫ్, మే 2: వ్యాపారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కోయంబేడు మార్కెట్‌కు ఈ నెల 5వ తేది సెలవు ప్రకటించారు. ఆ రోజు మదురైలో జరిగిన వ్యాపారుల మహానాడులో వర్తకులు పాల్గొనేందుకు సెలవు ప్రకటించామని, మరుసటిరోజు యధావిధిగా మార్కెట్ పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

గత నెలలో మెట్రోరైళ్లలో 80.87 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, మే 2: నగరంలో నడుపుతున్న మెట్రో రైళ్లలో ఏప్రిల్‌లో 80.87 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) విడుదల చేసిన ప్రకటనలో... ఈ ఏడాది జనవరిలో 84,63,384 మంది, ఫిబ్రవరిలో 86,15,008, మార్చిలో 86,82,457 మంది మెట్రోరైళ్లలో ప్రయాణించారు. ఇక, ఏప్రిల్ నెలలో 80,87,712 మంది ప్రయాణించగా, ఆ నెల 8వ తేది అధికంగా 3,24,055 మంది ప్రయాణించారు. వీరిలో క్యూఆర్ కోడ్ వినియోగించి 33,34,498 మంది, సీజన్ పాస్‌తో 33,23,602, టోకెన్ల ద్వారా 61,976, సింగార చెన్నై కార్డు ద్వారా 13,63,351 మంది, గ్రూప్ టిక్కెట్ సిస్టమ్ ద్వారా 4,285 మంది ప్రయాణించినట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

నేటినుంచి చెన్నై బీచ్-తిరువణ్ణామలై మెము ప్యాసింజర్

పెరంబూర్, మే 2: చెన్నై బీచ్-తిరువణ్ణామలై మెము ప్యాసింజర్ రైలు సేవలు శుక్రవారం నుంచి అందుబాటులో ఉంటాయని దక్షిణ రైల్వే తెలిపింది. చెన్నై బీచ్ నుంచి ప్రతిరోజు వేలూరు కంటోన్మెంట్‌కు నడుపుతున్న మెము ప్యాసింజర్‌ను ఈ నెల 2 నుంచి తిరువణ్ణామలై వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. కానీ, నిర్వహణ కారణాలతో గురువారం ఈ సేవలు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో, శుక్రవారం నుంచి ఈ రైలు సేవలు ప్రారంభమవుతాయని దక్షిణ రైల్వే ప్రకటించింది. ఆ ప్రకారం, చెన్నై బీచ్ నుంచి ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు బయల్దేరే రైలు అర్ధరాత్రి 12.05 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో తిరువణ్ణామలై నుంచి తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి ఉదయం 9.50 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది. ఈ రైలుకు చెన్నై బీచ్ నుంచి తిరువణ్ణామలైకు రూ.50 ఛార్జీగా నిర్ణయించారు.

ఖాళీ మద్యం సీసాలు తిరిగిచ్చే పథకం

రూ.306 కోట్ల వసూలు

● హైకోర్టుకు తెలిపిన టాస్మాక్

అడయార్, మే 2: మద్యం బాటిళ్లను తిరిగిచ్చే పథకం రాష్ట్రంలో అమలవుతుంది. ఈ పథకం కింద ఇప్పటివరకు 12 జిల్లాల్లో రూ.306 కోట్ల మేర వసూలైంది. మద్యం బాటిళ్ళు తిరిగి ఇచ్చిన వారికి రూ.297 కోట్లను అందజేసినట్టు మద్రాస్ హైకోర్టుకు టాస్మాక్ యాజమాన్యం తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుతం 4820 మద్యం షాపులున్నాయి. మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు ఖాళీ మద్యం సీసాలను తిరిగి తీసుకునే పథకాన్ని 2022 నుంచి రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఇందుకోసం మద్యం కొనుగోలు చేసే వారి నుంచి అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారు. ఖాళీ బాటిల్ తిరిగి అప్పగించి, అదనంగా వసూలు చేసిన రూ.10ని తీసుకు వెళ్ళవచ్చు. నీలగిరి, ఏర్కాడు, కొడైక్కెనాల్ వంటి ప్రాంతాల్లో ఈ పథకాన్ని అమలు చేయడం లేదు. అయితే, హైకోర్టు సూచన మేరకు కోవై, పెరంబలూరు, ధర్మపురి, నాగై, తిరువారూర్, తంజావూరు, తిరుచ్చి, పుదుక్కోట, కడలూరు, చెన్నై వంటి జిల్లాల్లో అమలవుతుంది. ఇపుడు చెన్నై నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ బాటిళ్లను తిరిగి స్వాధీనం చేసుకునే అంశంపై దాఖలైన పిటిషన్‌పై విచారణ గురువారం న్యాయమూర్తులు సతీష్‌కుమార్, భరత చక్రవర్తిలతో కూడిన ధర్మాసనం విచారణకు వచ్చింది. అపుడు టాస్మాక్ యాజమాన్యం ఒక అఫిడవిట్ సమర్పించింది. ఖాళీ మద్యం సీసాలు తిరిగిచ్చే పథకం చెన్నైతో పాటు 12 జిల్లాల్లో అమలవుతోంది. ఈ 12 జిల్లాల్లో ఒక్కో బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేయగా, మొత్తం 306 కోట్ల 32 లక్షల 25 వేల 330 రూపాయలను వసూలైంది. అయితే, ఖాళీ బాటిళ్లను తిరిగిచ్చిన వారికి రూ.297 కోట్ల 97 లక్షల 61 వేల 280 ఇచ్చారు. అలాగే, మరో ఐదు జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల రూ.56.45 కోట్లు వసూలు చేసి, రూ.54.64 కోట్లను తిరిగి చెల్లించారు.. అయినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా మద్యం బాటిళ్ళ ద్వారా వసూలైన నిధులు, తిరిగి అప్పగించిన నిధులను మరోమారు ఆడిటింగ్ చేసి పూర్తి నివేదిక సమర్పిస్తామని పేర్కొంది. దీంతో ఈ కేసు తదుపరి విచారణను జూన్ 7వ తేదీకి వాయిదా వేశారు.

స్వీయ ప్రసవంలో శిశువు మృతి

● నర్సుపై హత్యకేసు నమోదు

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): స్వీయ ప్రసవం ఉదంతంలో పసికందు మృతికి కారణమైన కోడంబాక్కం ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న కన్నియాకుమారికి చెందిన నర్సుపై మాంబళం పోలీసులు హత్యకేసు నమోదు చేశారు. టి.నగర్ సౌత్ బోగ్‌రోడ్డులో స్నేహితులతో కలిసి ఉంటున్న ఆ నర్సు తనతో పాటు పనిచేస్తున్న ఉసిలంపట్టికి చెందిన యువకుడితో పరిచయం పెట్టుకుంది. పెళ్ళికాకుండానే అతడితో సహజీవనం చేయడంతో గర్భం దాల్చి రెండు రోజులకు ముందు స్వీయ ప్రసవం చేసుకునే ప్రయత్నంలో ఆడ శిశువు కాలిని కత్తితో నరికింది. దీంతో ఆ పసికందు మృతిచెందింది.. నర్సు స్నేహితులు వెంటనే ఆమెను, మృతి చెందిన పసికందు శవాన్ని ఎగ్మూరు చిల్డ్రన్స్ ఆస్పత్రికి తరలించడంతో నర్సు స్వీయ ప్రసవం బయటపడింది. ఈ సంఘటనపై మాంబళం పోలీసులు విచారణ జరిపి ఆ నర్సుపై హత్యాకేసు నమోదు చేశారు.

కపాలీశ్వరాలయంలో 'డాన్స్ వసంత్ ఉత్సవం'

పెరంబూర్, మే 2: స్థానిక మైలాపూర్ కపాలీశ్వరాలయంలో సరస్వతి ఎడ్యుకేషనల్ కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'డాన్స్ వసంత్ ఉత్సవ్' పేరిట కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ వేడుకలను కళాక్షేత్ర ట్రస్ట్ మాజీ డైరెక్టర్ రేవతి రామచంద్రన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ కేవీ మురళీధరన్ ప్రారంభించారు. అలాగే, ఆర్ట్స్ అండ్ కల్చర్ తమిళనాడు డైరెక్టర్ ఎస్సార్ గాంధీ, ప్రముఖ గురువులు మేలాతూర్ భగవత మేలా ఎస్.కుమార్, ఎస్.నరసింహన్, డా.ఎస్.వెంకటేశన్ సహా పలువురు పాల్గొన్నారు. వేడుకల్లో తొలిరోజు డా.వినయ్ మాధవన్ బృందం భరత నాట్యం ప్రదర్శించారు. 11వ తేది వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కళాకారులతో అతిథులు, నిర్వాహకులు

రూ.4 కోట్ల స్వాధీనం వ్యవహారం

● విచారణకు హాజరైన నయినార్ నాగేంద్రన్ అనుచరులు

పెరంబూర్, మే 2: రైలులో రూ.4 కోట్ల స్వాధీనం చేసుకున్న వ్యవహారంలో నయినార్ నాగేంద్రన్ సహాయకుడు సహా ఇద్దరు విచారణకు హాజరయ్యారు. ఎగ్మూర్ నుంచి తిరునల్వేలికి ఏప్రిల్ 6వ తేది నెల్లై ఎక్స్‌ప్రెస్‌లో తీసుకెళ్తున్న రూ.3.98 కోట్లను తాంబరం రైల్వేస్టేషన్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదు తీసుకెళ్తున్న తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ అనుచరులు కొళత్తూర్ వీకే నగర్‌కు చెందిన సతీష్, అతని తమ్ముడు నవీన్, తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం ప్రాంతానికి చెందిన పెరుమాళ్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నగదును నయినార్ నాగేంద్రన్ ఎన్నికల ఖర్చులకు తీసుకెళ్తున్నట్లు విచారణలో వారు చెప్పినట్టు సమాచారం. దీంతో, ముగ్గురిపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి నయినార్ నాగేంద్రన్, బీజేపీ నేత నగరానికి చెందిన గోవర్ధన్ సహా 8 మందిపై తాంబరం పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ క్రమంలో, తాంబరం నగర పోలీస్ కమిషనర్ ఎ.అమల్‌రాజ్ సిఫారసులతో ఈ కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ గత నెల 26వ తేది ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, గత ఆదివారం తాంబరం పోలీసులు కేసుకు సంబంధించిన పత్రాలను సీబీసీఐడీకి అప్పగించారు. ఈ కేసులో అరెస్టయి బెయిలుపై విడుదలైన సతీష్, అతని తమ్ముడు నవీన్, పెరుమాళ్‌లపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసు విచారణ ముమ్మరం చేసిన సీబీసీఐడీ పోలీసులు, నయినార్ నాగేంద్రన్ అనుచరులు మురుగన్, ఆసైతండిలకు సమన్లు జారీచేయగా, గురువారం వారు సీబీసీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో త్వరలో నయినార్ నాగేంద్రన్‌ను విచారించేందుకు సమన్లు జారీచేయాలని సీబీసీఐడీ నిర్ణయించారు. కాగా, ఇప్పటికే ఈ కేసులో నవీన్, పెరుమాళ్, సతీష్‌లను సీబీసీఐడీ విచారించిన విషయం తెలిసిందే.

వీఐటీ వర్సిటీలో 'ప్రత్యేక కేంద్రం' ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్రిస్ హుడ్జెస్, వర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ తదితరులు

వేలూరు, మే 2: స్థానిక వీఐటీ విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ క్లీన్ ఎన్విరాన్‌మెంట్' కేంద్రం ప్రారంభమైంది. వర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూఎస్ కాన్సులేట్ జనరల్ క్రిస్ హుడ్జెస్ పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిస్ హుడ్జెస్ మాట్లాడుతూ... ఉన్నత విద్యలో వీఐటీ సంస్థ విశేషంగా రాణిస్తోందని, వర్సిటీతో యూఎస్ కాన్సులేట్ మంచి అనుబంధం ఉందన్నారు. అనంతరం వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ... అమెరికాలోని యూనివర్సిటీల్లో భారత దేశ విదార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ఈ కేంద్రంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ తదితరాలపై పరిశోధన చేపట్టనున్నట్లు చాన్సలర్ తెలిపారు.

రాష్ట్రానికి 22,000 మెగావాట్ల విద్యుత్ అవసరం

● టీఎన్ఈబీ అధికారులు

ప్యారీస్, మే 2: రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న కారణంగా 22,000 మెగావాట్ల విద్యుత్ అవసరమని తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) అధికారులు తెలిపారు. రాష్ట్రంలో బుధవారం 21,000 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగిందని, రాబోయే రోజుల్లో ఇది 22,000 మెగావాట్లకు చేరుకొనే అవకాశముందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తయ్యే విద్యుత్‌తో పాటు ప్రైవేటు సంస్థల నుంచి కూడా విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వేసవి సీజన్‌లో సాధారణ రోజుల కంటే విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, ఏసీల వినియోగంతో విద్యుత్ అవసరం కూడా బాగా పెరిగిందన్నారు. మార్చి 22వ తేదీన 19,409 మెగావాట్ల విద్యుత్ వినియోగించారన్నారు. ఇది క్రమక్రమంగా పెరుగుతూ గత నెల 20 నాటికి 20,000 మెగావాట్లకు చేరుకొని బుధవారానికి 21,700 మెగావాట్లకు చేరుకుందన్నారు. ప్రైవేటు విద్యుదుత్పత్తి సంస్థల నుంచి కొనుగోలు చేసే విద్యుత్‌తో జూన్ వరకు 4,500 మెగావాట్లు వినియోగించుకోనున్నట్లు అధికారులు వివరించారు.

'రెడ్ జోన్'లుగా లెక్కింపు కేంద్రాలు

పెరంబూర్, మే 2: నగరంలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రాలను 'రెడ్ జోన్'లుగా ప్రకటిస్తూ పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోకవర్గాలకు గత నెల 19వ తేది ఒకే విడతలో పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. చెన్నై జిల్లా పరిధిలోని ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై, మధ్య చెన్నై లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను నుంగంబాక్కంలోని లయోలా కళాశాల, మైలాపూర్ క్వీన్ మేరీస్ కళాశాల, గిండిలోని అన్నా విశ్వవిద్యాలయాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. వాటి సమీపంలోనే లెక్కింపు కేంద్రాల్లో జూన్ 4వ తేది కౌంటింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో, లెక్కింపు కేంద్రాలను రెడ్ జోన్లుగా ప్రకటించారు. ఈ ప్రాంతంలో జూన్ 4వ తేది వరకు డ్రోన్లు ఎగిరేందుకు నిషేధం విధిస్తూ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో వైభవంగా రథోత్సవం



ప్యారీస్, మే 2: అంతర్జాతీయ కృష్ణ భక్తి సంస్థ (ఇస్కాన్) ఉత్తర చెన్నై ఆధ్వర్యంలో బుధవారం తిరునింద్రవూర్‌లో నిర్వహించిన రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. 'గౌరనిధాయ్' పేరుతో మూడో సంవత్సర రథయాత్రను తిరునింద్రవూర్ మున్సిపల్ ఛైర్ పర్సన్ ఉషారాణి సాయంత్రం ప్రారంభించారు. సీటీహెచ్ రోడ్డు నుంచి బయల్దేరిన రథం తిరునింద్రవూర్ ఫ్లై ఓవర్, పెరియపాళయం రోడ్డు, గోమతిపురం మెయిన్ రోడ్ల మీదుగా ఇస్కాన్ మందిరానికి చేరుకుంది. సుమారు 5 వేల మందికి పైగా కృష్ణ భక్తులు ఈ యాత్రలో పాల్గొని 'హరే రామ హరే కృష్ణ' అని స్తుతిస్తూ భక్తిని చాటుకున్నారు. అనంతరం రాత్రి 7.15 గంటలకు ప్రభు బాదర్ థియేటర్స్ వారిచే 'అంబరీష్' నాటక ప్రదర్శన, 8.15 గంటలకు హారతి, ప్రసాద వినియోగం నిర్వహించినట్లు సంస్థ జనరల్ మేనేజర్ జయగోపీనాథ దాస్ తెలిపారు.

మాదకద్రవ్యాలతో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, మే 2: స్థానిక పాత చాకలిపేటలో చట్టవిరుద్ధంగా మాదకద్రవ్యాలు విక్రయించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వాషర్‌మెన్‌పేటకు చెందిన ఖాదర్ మొహిద్దీన్‌ను చెన్నై నార్త్ జోన్ పోలీసులు అరెస్ట్ చేసి, అతడి నుంచి 8 గ్రాముల మెత్‌బెటామిన్ అనే మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించి ట్రిప్లికేన్ ప్రాంతానికి చెందిన సుల్తాన్ అల్లావుద్దీన్ అదుపులోకి తీసుకున్నారు. ఆ మేరకు తిరువాన్మియూర్‌కు చెందిన రాహుల్ నుంచి భారీస్థాయిలో మాదకద్రవ్యాలు కొనుగోలు చేసిన విషయం తెలిసింది. దీంతో తిరువాన్మియూర్ ప్రాంతానికి వెళ్లిన పోలీసులు, రాహుల్ ఇంటిని చుట్టుముట్టి అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదుచేసి, మాదకద్రవ్యాలు ఏ ప్రాంతం నుంచి ఎవరి దగ్గర కొనుగోలు చేస్తున్నారు, నగరంలో ఎవరెవరికి విక్రయిస్తున్నారు అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ జూదంపై ప్రభుత్వం సీరియస్

● ప్రకటనలు చేసే సంస్థలకు జైలు, జరిమానా

పెరంబూర్, మే 2: ఆన్‌లైన్ జూదంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఆన్‌లైన్ జూదానికి సంబంధించి ఆయా సంస్థలు వాణిజ్య ప్రకటనలు, బ్యానర్లు తదితరాలు ఏర్పాటుచేస్తే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు సచివాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... ఆన్‌లైన్ జూదానికి సంబంధించి ప్రకటనలు చేసే సంస్థలకు ఏడాది జైలు, రూ.5 లక్షల జరిమానా విధిస్తామని, అలాంటి నేరాలు మళ్లీ పాల్పడే సంస్థలకు మూడేళ్ల జైలు, రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది.

బీజేపీలో చేరనున్నాననే వార్తలు అవాస్తవం

● మాజీ మంత్రి సెంగోట్టయన్

పెరంబూర్, మే 2: బీజేపీలో తాను చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయన్ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగిస్తే తాను ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమని మాజీ మంత్రి సెంగోట్టయన్ తెలిపినట్లు సోషల్ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. వాటిపై ఈరోడ్‌లో గురువారం ఆయన స్పందిస్తూ... 45 ఏళ్లుగా నిజాయితీతో కూడిన రాజకీయాలు చేస్తున్నానని, తాను బీజేపీలో చేరతాననేది అసత్యమని ఆయన స్పష్టం చేశారు.

కాపుకాడులో కార్చిచ్చు

ఐసిఎఫ్, మే 2: చెన్నై సమీపంలోని కాపుకాడులో కార్చిచ్చు ఏర్పడినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. చెంగల్పట్టు సింగపెరుమాళ్ ఆలయం చెన్నై జాతీయ హైవే సమీపంలో సుమారు పదెకరాల విస్తీర్ణంలో కాపుకాడు అనే అటవీ ప్రాంతముంది. ఇక్కడ ఎక్కువగా యూకలిప్టస్ చెట్లు, ఔషధ గుణాలు కలిగిన మూలికా చెట్లు ఉన్నాయి. బుధవారం కార్చిచ్చు కారణంగా చెట్లు దగ్ధమయ్యాయి. మరమలైనగర్ అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని రెండు గంటలు శ్రమించి మంటలు ఆర్పారు.

క్వారీ పేలుడు కుటుంబాలకు రూ.12 లక్షల పరిహారం

పెరంబూర్, మే 2: విరుదునగర్ జిల్లా కారియంపట్టి సమీపం ఆవియూరులో క్వారీలో బుధవారం సంభవించిన పేలుడు ఘటనలో కందస్వామి, దురై, గురుస్వామి మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించి క్వారీ యజమానులు రాజ్‌కుమార్, సేతువర్ధన్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మరో ఇద్దరు భాగస్వాముల కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మృతుల కుటుంబాలకు క్వారీ యజమానుల తరపున తలా రూ.12 లక్షలు గురువారం అందజేశారు. నగదుగా రూ.50 వేలు, చెక్కు రూపంలో రూ.11.50 లక్షలను మృతుల కుటుంబాలకు అందజేశారు.

పెరిగిన బీరు విక్రయాలు

● మంత్రి ముత్తుస్వామి



సంచార చలివేంద్రాలు ప్రారంభిస్తున్న మంత్రి ముత్తుస్వామి

పెరంబూర్, మే 2: వేసవి కావడంతో, టాస్మాక్ దుకాణాల్లో బీరు విక్రయాలు పెరిగాయని గృహ, ఎక్సైజ్ శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి తెలిపారు. డీఎంకే కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈరోడ్‌లో మూడు సంచార చలివేంద్రాలు ప్రారంభించిన మంత్రి ముత్తుస్వామి మాట్లాడుతూ... పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ ఆరోపిస్తున్నట్లు, ప్రభుత్వం బీరు ఉత్పత్తి పెంచలేదన్నారు. కానీ, ఎండా కాలం కావడంతో మద్యం ప్రియులు బీరు ఎక్కువగా తాగుతున్నారని తెలిపారు. అదే సమయంలో ఇతర మద్యం రకాల విక్రయాలు తగ్గాయన్నారు. వేసవి ఎండల నుంచి ప్రజలను రక్షించేలా చెన్నైలో మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్ల ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు వీటిని అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

బాలుడి లంగ్స్ నుంచి లెడ్ బల్బ్ తొలగింపు

అడయార్, మే 2: నగరంలోని శ్రీరామచంద్ర హాస్పిటల్ వైద్యుల బృందం ఐదేళ్ళ బాలుడి ప్రాణాలను రక్షించింది. నెల రోజుల క్రితం ఈ బాలుడు లెడ్ బల్బ్‌ను మింగడంతో అది ఊపిరితిత్తుల్లో చిక్కుకుంది. దాన్ని గుర్తించిన వైద్యులు బ్రాంకోస్కోపీ విధానం ద్వారా వెలికి తీసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా ఆ బల్బు తొలగించి బాలుడి ప్రాణాలను రక్షించారు. ఆస్పత్రి పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఆర్ మధు, అనెస్థీషియా పీడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ అరుణా పరమేశ్వరి సారథ్యంలోని వైద్య బృందం ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసింది. గత శుక్రవారం దగ్గు, శ్వాస పీల్చడంతో తీవ్ర ఇబ్బంది పడుతూ ఆస్పత్రికి వచ్చిన బాలుడిని పరీక్షించి, లెడ్ బల్బ్ ఊపిరితిత్తుల్లో ఉన్నట్టుగా స్కాన్ ద్వారా వైద్యులు గుర్తించారు. దీన్ని తొలగించేందుకు బ్రాంకోస్కోపీతో పాటు మరో విధానంతో ప్రయత్నించగా విఫలమైంది. దీంతో ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా ఆ బల్బును తొలగించింది. ప్రస్తుతం ఈ బాలుడు ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. అలాగే, బాలుడిని ఐసీయూ లేదా వెంటిలేషన్ వార్డులో ఉంచకుండానే డిశ్చార్జ్ చేసినట్టు వైద్య బృందం పేర్కొంది.

ప్లస్ టూ ఫలితాలు సిద్ధం

● ఈసీ అనుమతి కోరిన పాఠశాల విద్యాశాఖ

పెరంబూర్, మే 2: రాష్ట్రంలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షా ఫలితాలు సిద్ధమైన నేపథ్యంలో, ఫలితాల విడుదలకు అనుమతించాలని కోరుతూ ఎన్నికల సంఘానికి పాఠశాల విద్యాశాఖ లేఖ రాసింది. తమిళనాడు, పుదుచ్చేరిలో మార్చిలో నిర్వహించిన ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు 8 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. జవాబుపత్రాల మూల్యాంకనం, మార్కుల గణన ముగించి ఈ నెల 6వ తేది పరీక్షా ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఇదివరకే ప్రభుత్వ పరీక్ష శాఖ ప్రకటించింది. ఈ క్రమంలో, మూల్యాంకనం, మార్కుల గణన పూర్తయి ఫలితాలు సిద్ధం చేశారు. సాధారణంగా పరీక్షా ఫలితాలను పాఠశాల విద్యాశాఖ మంత్రి విడుదల చేయడం ఆనవాయితీ. కానీ, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఫలితాలు మంత్రి విడుదల చేయడంలో చిక్కులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో, ప్లస్ టూ పరీక్షా ఫలితాల విడుదలకు అనుమతి కోరుతూ ఈసీకి పాఠశాల విద్యాశాఖ లేఖ రాసింది. ఈ ఫలితాలను మంత్రి విడుదల చేస్తారా? పరీక్ష శాఖ నేరుగా విడుదల చేస్తుందా? అనే విషయం ఈసీ నిర్ణయం మేరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

షోలింగర్‌లో మూడు రోజుల పాటు ఆగిన రోప్‌కార్ సేవలు



షోలింగర్ ఆలయ రోప్‌కార్

ప్యారీస్, మే 2: రాణిపేట జిల్లాలోని షోలింగర్ నరసింహాలయంలో మరమ్మతుల కారణంగా మూడు రోజుల పాటు రోప్‌కార్ సేవలు నిలిపివేశారు. షోలింగర్ పరిధిలోని కొండాపాళయంలోని కొండపై వెలసిన నరసింహ స్వామి ఆలయానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వస్తుంటారు. స్వామివారి దర్శనం కోసం 1,305 మెట్లు ఎక్కి వెళ్లాల్సి ఉంది. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, మహిళలు మెట్ల దారి గుండా వెళ్లలేకపోతున్నారు. దీంతో రోప్‌కార్ సేవలకు 2010లో శంకుస్థాపన జరగగా, ఇటీవల ముగియడంతో, ముఖ్యమంత్రి స్టాలిన్ రోప్‌కార్ సేవలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, మరమ్మతుల కారణంగా గురువారం నుంచి 4వ తేది వరకు రోప్‌కార్ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆలయ వేడుకల్లో ఘర్షణ

ఇరువర్గాల పరస్పర దాడులు ● దుకాణాలు, వాహనాలకు నిప్పు



దుకాణాలకు నిప్పంటించిన దృశ్యం

పెరంబూర్, మే 2: సేలం జిల్లాలో ఆలయ వేడుకల్లో ఇరువర్గాల పరస్పర దాడులకు పాల్పడడంతో పాటు దుకాణాలు, వాహనాలకు నిప్పంటించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తీవట్టిపట్టి గ్రామంలో గురువారం మారియమ్మన్ ఆలయ ఉత్సవాలు జరిగాయి. ఈ వేడుకల్లో ఒక వర్గాన్ని మరొక వర్గం ఆలయంలోకి అనుమతించలేదని సమాచారం. ఈ వ్యవహారంపై ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగి ఒక్కసారిగా పరస్పర దాడులకు దారితీశాయి. ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడ్డాడు. కొందరు ఆలయ సమీపంలోని దుకాణాలు, వాహనాలకు నిప్పంటించారు. అంతలో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపజేసే ప్రయత్నంలో వారు పోలీసులపై కూడా దాడికి పాల్పడ్డాడు. దీంతో, అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను చెల్లాచెదురు చేసి పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు. ఈ కారణంగా ఆలయ వేడుకలు ఆగిపోగా, ఆ తరవాఅత అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గ్రామంలో గట్టి పోలీసు భద్రత ఏర్పాటైంది.

ఐపీఎల్ టిక్కెట్లు బ్లాక్‌లో విక్రయం.. 13 మంది అరెస్ట్

పెరంబూర్, మే 2: ఐపీఎల్ టిక్కెట్లు బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. చేపాక్కం క్రికెట్ మైదానంలో బుధవారం చెన్నై సూపర్ కింగ్స్-కింగ్స్ ఎలెవన్ పంజాబ్ మధ్య మ్యాచ్ జరిగింది. ఆ రోజు స్టేడియం పరిసర ప్రాంతాల్లో నిఘా చేపట్టిన పోలీసులు, ఐపీఎల్ టిక్కెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్న 13 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1.19 లక్షల నగదు, 33 టిక్కెట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఏనుగు దంతంతో నలుగురి అరెస్ట్

పెరంబూర్, మే 2: ఏనుగు దంతం విక్రయించేందుకు యత్నించిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోయంబత్తూర్ జిల్లా వడవల్లి ప్రాంతంలో చట్టవిరుద్ధంగా ఏనుగు దంతం విక్రయిస్తున్నారనే సమాచారంతో, అటవీ శాఖ అధికారులు గురువారం ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో దంతం విక్రయించేందుకు యత్నించిన విశాఖన్, కార్తికేయన్, బ్రిట్టో, సెల్వరాజ్‌లను అరెస్ట్ చేసిన అధికారులు, వారి నుంచి ఏనుగు దంతం స్వాధీనం చేసుకున్నారు.

జమ్ముకశ్మీర్‌లో కారైక్కాల్ సైనికుడి మృతి

అడయార్, మే 2: జమ్మూకశ్మీర్ రాష్ట్రంలోని భారత్ - చైనా సరిహద్దుల్లో కారైక్కాల్ ప్రాంతానికి చెందిన ప్రేమ్‌కుమార్ అనే సైనికుడు అనారోగ్యం కారణంగా మృత్యువాతపడ్డారు. గత నెల 30వ తేదీ ఇండోచైనా సరిహద్దుల్లో విధుల్లో ఉన్న సమయంలో ప్రవీణ్ కుమార్ హఠాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆయనను హుటాహుటిన సమీపంలోని వైద్య శిబిరానికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే ప్రవీణ్ కుమార్ చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. దీంతో ప్రవీణ్ కుమార్ భౌతికకాయాన్ని విమానంలో చెన్నై తరలించి, అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఆయన సొంతూరు తరలించి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతుడికి భార్య సెవ్వంతి, ఐదేళ్ళ కుమార్తె కీర్తన ఉంది. పైగా సెవ్వంతి ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. భర్తను కోల్పోయిన సెవ్వంతితో పాటు ప్రేమ్‌కుమార్ తల్లిదండ్రులను ఓదార్చడం స్థానికుల తరం కావడం లేదు.

దిండివనం సమీపంలో 2,720 సీసాల మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ప్యారీస్, మే 2: విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో రెండు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీ చేసిన పోలీసులు 2,700 సీసాల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దిండివనం చేరువలో ఉన్న బ్రహ్మదేశం, కుప్పతంగల్‌లోని టాస్మాక్ మద్యం దుకాణాల్లో బ్లాక్ మార్కెట్‌లో మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో అక్కడకు పోలీసులు చేరుకున్న సమయంలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వారిని చూసి పరారయ్యారు. విచారణలో, పరారైన వారు బార్ నిర్వాహకుడు దక్షిణామూర్తి కుమారుడు విజయ్ (34), జ్ఞానశేఖర్ కుమారుడు విఘ్నేష్ (28) అని తెలిసింది. వారిని బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు.

బాలికపై హత్యాచారం కేసు

● 500 పేజీల చార్జిషీటు దాఖలు

పుదుచ్చేరి, మే 2: పుదుచ్చేరిలో పెనుసంచనంగా మారిన తొమ్మిదేళ్ళ బాలిక హత్యాచారం కేసులో 500 పేజీల చార్జిషీటును పోలీసులు పోక్సో కోర్టులో దాఖలు చేశారు. పుదువై ముత్యాల్‌పేటలో 9 యేళ్ళ బాలికను మార్చి నెలలో అత్యాచారం చేసి హత్య చేసిన విషయం తెల్సిందే. ఈ కేసు ఒక్క పుదుచ్చేరిలోనే కాకుండా దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి గంజాయికి బానిస అయిన వివేకానందన్ (57), కరుణాస్ (19) అనే ఇద్దరు నిందితులు ఈ దారుణానికి పాల్పడినట్టు గుర్తించి, వారిని అరెస్టు చేశారు. అయితే, పోక్సో కేసులో 60 రోజుల్లోనే చార్జిషీటు దాఖలు చేయాలన్న నిబంధన ఉండటంతో పోలీసులు త్వరితగతిన విచారణ పూర్తి చేసి 500 పేజీల చార్జిషీటును తయారు చేశారు. ఈ కేసు విచారణను డీజీపీ శ్రీనివాస్ స్వయంగా పర్యవేక్షించారు. దీంతో ఈ చార్జిషీటును పుదుచ్చేరి ప్రత్యేక పోక్సో కోర్టులో గురువారం దాఖలు చేశారు.

జల్లికట్టు ఎద్దుకు జన్మదిన వేడుకలు



జల్లికట్టు ఎద్దుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెరంబూర్, మే 2: మదురై జిల్లా అలంగానల్లూర్‌లో జల్లికట్టు ఎద్దు జన్మదిన వేడుకలు బుధవారం జరిగాయి. ఇటీవల నిర్వహించిన పలు జల్లికట్టు పోటీల్లో పాల్గొన్న 'కారి' అనే ఎద్దు బహుమతులు గెలుచుకుంది. ఆ ఎద్దు జన్మదినం సందర్భంగా గ్రామ యువజన విభాగం ఆధ్వర్యంలో ఎద్దుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు, కారిని ఆశీర్వదించారు. అనంతరం యువజన విభాగం తరపున గ్రామస్తులకు అన్నదానం అందజేశారు.

షోలింగర్ ఆలయానికి వెళ్లిన భక్తుడి మృతి

పెరంబూర్, మే 2: షోలింగర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లిన భక్తుడు కొండ ఎక్కుతూ మృతిచెందాడు.. రాణిపేట జిల్లాలోని ఈ కొండ ఆలయానికి వెళ్లాలంటే భక్తులు 1,306 మెట్లు ఎక్కాల్సి ఉంది. కొద్దిరోజులుగా జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, బెంగళూరుకు చెందిన భక్తుడు ముత్తుకుమార్ గురువారం ఉదయం మెట్ల మార్గంగా ఆలయానికి బయల్దేరాడు. 1200వ మెట్టు వద్ద ఒక్కసారి శ్వాస తీసుకొనేందుకు ఇబ్బంది పడి స్పృహతప్పి పడి మృతిచెందాడు. కాగా, మరమ్మతుల కారణంగా కొండ ఆలయానికి వెళ్లే రోప్‌కార్ సేవలు గురువారం తాత్కాలికంగా నిలిపివేశారు.

కన్నియాకుమారిలో అద్దాల వంతెన కోసం

ఇనుప కమ్మీల ఫ్రేమ్



తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతం నుంచి వివేకానంద స్మారక మండపం వరకు అమర్చిన ఐరన్ ఫ్రేమ్

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలోని వివేకానంద స్మారక మండపం తిరువళ్లువర్ విగ్రహం మధ్య అద్దాల కాలిబాట వంతెన నిర్మాణంలో భాగంగా గురువారం ఆ రెండు ప్రాంతాలను కలిపేలా ఐరన్ ఫ్రేమ్ ఏర్పాటు చేశారు. పుదుచ్చేరి నుంచి తెప్పించిన ఐరన్ ఫ్రేమ్‌ను ఆరు స్తంభాలతో అనుసంధానిస్తూ అమర్చారు. ఈ పనులన్నీ ముగియడానికి మరో ఆరునెలలు పట్టవచ్చునని అధికారులు చెబుతున్నారు.

ఆధ్యాత్మికం

పుదుకోట జిల్లా అరంతాంగికి కూతవేటు దూరంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆవుడయార్ కోవిల్ శివాలయాలన్నింటికంటే వైవిధ్యభరితంగా ప్రాచీన శిల్పకళలకు నెలవుగా విరాజిల్లుతోంది. 1100 యేళ్ల నాటి ఆ ప్రాచీన ఆలయంలో నంది, ధ్వజస్తంభం, బలిపీఠం, అసలు రూపమే లేకుండా పరమేశ్వరుడు లింగరూప అడుగుభాగంలో దర్శనమిస్తున్నారు. తిరువాడుదురై ఆధీనం (పీఠం) నిర్వహిస్తున్న ఈ ఆవుడయార్ ఆలయాన్నే నేటి మేటి శిల్పకారులంతా శిల్పశాస్త్రాన్ని అభ్యసించడానికి మార్గదర్శకంగా స్వీకరిస్తారు. శివాలయాల్లో పరమేశ్వరుడికే అగ్రతాంబూలమైతే ఈ ఆలయంలో ఆయన శిష్యుడైన మాణిక్యవాసగర్ ప్రథమ పూజలు అందుకుంటున్నారు. ఆలయంలోని ప్రాచీన స్తూపాల రూపాల్లో నేటి నగల డిజైన్లు కూడా ఉండటం విశేషం. వెయ్యేళ్ల క్రితం మాణిక్యవాసగర్ నిర్మించిన ఈ ఆలయ పైకప్పులో ఓ చోట చెన్నై మైలాపూరు కపాలీశ్వరాలయం, తిరువేర్కాడు కరుమారి యమ్మన్ ఆలయ విశేషాలు కూడా చెక్కబడి ఉన్నాయి. ఆలయమంతా ఉన్న శిల్పాలు, స్తంభాలు, స్తూపాలు ఆనాటి మేటి శిల్పకళాకారుల అద్భుత సృష్టికి తార్కాణంగా నిలిచాయి. భవిష్యత్‌లో ఇనుపకమ్మీలు వినియోగిస్తారనే చెప్పేలా పైకప్పులో ఇనుమ కమ్మీల రకాలను కుడ్యశిల్పంగా చెక్కబడి ఉండటం విశేషం. పరమశివుడే మాణిక్యవాసగర్‌కు గురువై జ్ఞానబోధ చేసిన దివ్యక్షేత్రమిది.

- ఆంధ్రజ్యోతి, చెన్నై


మహావిష్ణువు - నరసింహస్వామి - కుడిపాదం పైకెత్తి నృత్యం చేస్తున్న నటరాజస్వామి

వైవిధ్యాలకు నెలవు
ఆవుడయార్ కోవిల్

- నంది, ధ్వజస్తంభం, బలిపీఠం లేని శివాలయం
- మాణిక్య వాసగర్‌కే అగ్రతాంబూలం
- గర్భాలయంలో రూపరహిత పరమేశ్వరుడు
- ఈ శిల్పాల నుంచే నేటి నగల డిజైన్లు
- పైకప్పులో చెన్నై ఆలయాలు


ఆవుడయార్ ఆలయం

స్వామివారి నామధేయం : ఆత్మనాథర్
అమ్మవారి నామధేయం : యోగాంబాళ్
స్థల వృక్షం : రేగి చెట్టు (కురుందమరం)
తీర్థం : అగ్నితీర్థం
ప్రాచీన నామాలు : తిరుపెరుందురై, చతుర్వేది మంగళం
ఊరిపేరు : ఆవుడయార్ కోవిల్

స్థలపురాణం...

పూర్వం మదురైని పరిపాలించిన హరిమర్ధన పాండ్య చక్రవర్తి వద్ద మాణిక్యవాసగర్ మంత్రిగా పనిచేస్తుండేవారు. తన సైన్యంలో అశ్వదళంలో మేలిరకం అశ్వాలు కొరవడటంతో వాటిని కొనుగోలు చేసుకురమ్మంటూ చక్రవర్తి కాసులిచ్చి మాణిక్యవాసగర్‌ను తిరుపెరుందురై (ఆవుడయార్ కోవిల్ ప్రాంతానికి)కి పంపారు. మాణిక్యవాసగర్ అక్కడికి వెళ్ళగా శివాగమ శబ్దాలు, మంత్రాలు వినిపించాయి. ఆ మంత్రాలు వినిపిస్తున్న దిశగా వెళ్లగా ఓ జ్ఞానగురువు రేగు పళ్ళ వృక్షం దిగువ ఆశీనులై ఉండడం చూసి ఆశ్చర్యపోతాడు. తనను శిష్యుడిగా చేర్చుకుని ఉపదేశించమంటూ ప్రార్థిస్తారు. అతడి కోరిక మేరకు ఆ గురువు జ్ఞానోపదేశం చేస్తారు. ఓ సారి మాణిక్యవాసగర్ శివనిష్ఠలో కొద్ది గంటల పాటు గడిపి కళ్ళు తెరచి చూడగా గురుదేవులు కనిపించలేదు. ఆ తర్వాతే తనకు ఉపదేశమిచ్చింది సాక్షాత్తూ పరమశివుడని తెలుసుకుని పరవశించి పోయాడు. గుర్రాలు కొనేందుకు చక్రవర్తి ఇచ్చిన సొమ్ముతో తన గురువైన పరమేశ్వరుడికి అద్భుతమైన ఆలయాన్ని నిర్మించాడు. ఈ విషయం తెలుసుకుని చక్రవర్తి ఆగ్రహం చెంది మాణిక్యవాసగర్‌కు కారాగారశిక్ష విధిస్తారు. పరమేశ్వరుడు మాణిక్యవాసగర్‌ను కాపాడేందుకు ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్న నక్కలను మేలి రకం గుర్రాలుగా మార్చి వాటిని మదురై తీసుకెళ్ళి చక్రవర్తికి అప్పగిస్తాడు. రాజు సంతసించి మాణిక్యవాసగర్‌ను జైలు నుండి విడుదల చేస్తారు. ఆ తర్వాత అర్ధరాత్రి అశ్వశాలలోని గుర్రాలన్నీ నక్కలుగా వాటి అసలు రూపం దాల్చి ఊళలు వేస్తాయి. రాజు మళ్ళీ ఆగ్రహించి మాణిక్యవాసగర్‌ను రోజూ పగటిపూట వైగనదిలో ఇసుకమీద ఎండలో నిలబెట్టమణి ఆదేశిస్తారు. రాజభటులు అతడిని ఆ విధంగానే శిక్షించడం చూసి కలత చెందిన పరమేశ్వరుడు వైగైనదికి వరదలు సంభవించేలా జేస్తారు. దీంతో రాజు ఆ నదికి ఏర్పడిన గండ్ల పూడ్చే పనులు చేపడతారు. ఆ సమయంలో కూలీ వేషంలో పరమశివుడు ఆ ప్రాంతానికి వెళ్ళి పనులు చేయకుండా కూలీగా ఇచ్చే పిట్టు తినటం చూసి రాజభటులు ఆయన వీపుపై బెత్తంతో కొడతారు. అదే సమయంలో చక్రవర్తి సహా ఆ రాజ్యంలోని అందరూ తమ వీపులపై బెత్తం దెబ్బలు తగిలి బాధపడతారు. ఈ సంఘటనతో మాణిక్య వాసగర్‌ను కాపాడేందుకు కూలీగా వచ్చింది పరమేశ్వరుడని తెలుసుకున్న చక్రవర్తి మాణిక్యవాసగర్ కాళ్ళపై పడి క్షమాపణలు పొందుతారు. పరమేశ్వరుడి ఈ లీలా విశేషం జరిగిన ప్రాంతమే ఆవుడయార్ కోవిల్ అని ఈ స్థలపురాణం చెబుతుంది. ఆ కారణంగానే ఆవుడయార్ ఆలయంలో ఉన్న పరమశివుడినే తమిళంలో కుదిరైసామి (గుర్రాల స్వామి) అని భక్తులు పిలుస్తున్నారు. ఇక నక్కలను గుర్రాలుగా మార్చి మదురై నగరానికి గుర్రంపై వెళ్ళిన పరమశివుడి విగ్రహం ఆలయంలో పంచాక్షరీ మండపం వద్ద దర్శనమిస్తుంది. ఈ గుర్రాలస్వామి తలపై కొప్పు, అశ్వికుల వస్త్రాలు ధరించి, చెర్నాకోల పట్టుకుని వైవిధ్యమైన రూపంలో దర్శనమిస్తున్నారు. ఈయనకు 'అశ్వనాథుడు' అనే పేరు కూడా ఉంది.


అశ్వనాథుడు (గుర్రాల స్వామి)

రూపరహిత పరమేశ్వరుడు...

రూపం(ఆకారంతో), అరూపం (ఆకారరహితుడై), అరువురువం (లింగాకారం) అంటూ మూడు రూపాల్లో అనుగ్రహించే పరమశివుడు ఈ క్షేత్రంలో మూలస్థానంలో అరూపుడై, లింగాకారంలోను, రేగు చెట్టు (కురుదమరం) రూపంలో, శైవభక్త శిఖామణి మాణిక్యవాసగర్ రూపంలోను చతుర్విధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. స్థలవృక్షం వద్దే మాణిక్యవాసగర్‌కు పరమశివుడు జ్ఞానబోధ చేయడం వల్ల ఆ స్థలంలో కార్తీక సోమవారాల్లో భక్తులు అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహిస్తారు. మూలస్థానంలో చతురప్రాకార ఆవడుయార్ మాత్రమే దర్శనమిస్తున్నారు. దానిపై ఓ కలశం ఉంది. ఆ కలశం దేహంగాను, దానిలోపల ఉన్నది ఆత్మగాను భావిస్తారు. ఈ స్వామివారు ఆత్మలన్నింటినీ కాపాడుతారు కనుక ఆయనను ఆత్మనాథుడు అని పిలుస్తున్నారు. ఆరుకాల పూజా సమయంలో ఈ స్వామివారికి అష్టోత్తర శత మూలికల మిశ్రమంతో కూడిన తైలాభిషేకం నిర్వహిస్తుండటం విశేషం. ఈ ఆలయంలో స్వామివారికి పూజారి హారతి పళ్లెం గర్భాలయం వెలుపల భక్తుల వద్దకు తీసుకుని వచ్చే ఆచారం లేదు. గర్భాలయంలో పూజారి కర్పూర హారతి పడుతున్నప్పుడు భక్తులు బయట నుంచే హారతిని కళ్ళకు అద్దుకుని నమస్కరిస్తారు. ఆలయంలో శివుడే జ్యోతి స్వరూపంగా ఉండటం వల్ల దీపారాధన పళ్లెం భక్తులు తాకే సంప్రదాయం లేదు.

తినేత్ర దీపం...

ఆవుడయార్ ఆలయంలోని మూలస్థానంలో పరమశివుడి వెనుక వైపు తెలుపు, ఎరుపు, పచ్చ వర్ణాల్లో దీపాలు వెలిగిస్తారు. తెలుపు రంగు సూర్యుడిగా, ఎరుపు రంగు అగ్ని దేవుడిగా, పచ్చరంగు చంద్రుడిగా భావిస్తారు. స్వామివారికి విగ్రహం లేకపోవడంతో ఈ మూడు దీపాలే ముక్కంటి దీపం (త్రినేత్రదీపం) గా భావిస్తారు.

దీపాల తత్త్వం...

ఆత్మనాధుడి ఆలయంలో ప్రతి లోగిలిలో నిర్ణీత సంఖ్యలోనే దీపాలు వెలిగిస్తారు. ఆ దీపాలు వేర్వేరు తత్త్వాలు సందేశాలను భక్తులకు తెలియజేస్తాయి. పరమశివుడి చుట్టూ తిరువాచ్చి వద్దనున్న 27దీపారాలు 27నక్షత్రాలకు సంకేతంగా ఉన్నాయి. వాటికి చేరువగా ఉన్న రెండు దీపాలు జీవాత్మ, పరమాత్మగా భావిస్తారు. సన్నిధి నుండి వెలుపలకు వస్తే పక్కపక్కనే ఉన్న ప్రవేశద్వారాల్లో పంచకళల సంకేతంగా పంచదీపాలు, 37 తత్త్వాలు, 51 అక్షరాలు, 11 మంత్రాలు, 224 రకాలలోహాలను తెలిపేలా నిర్దేశిత సంఖ్యల్లో దీపాలు వెలిగిస్తున్నారు. గ్రహదోషం ఉన్నవారు, పరమశివుడి వాకిట నేత దీపం వెలిగించి ఆరాధిస్తున్నారు.


అఘోర వీరభద్రస్వామి

ఉప్పుడు బియ్యం నైవేద్యం...

ఈ క్షేత్రంలో పరమశివుడు గురువుగా విద్యార్థులకు ఉపదేశం చేసినప్పుడు శిష్యులు సమర్పించిన అన్న ప్రసాదాన్ని ఆబగా ఆరగించారు. శిష్యులు వారిళ్ళలోని ఉప్పుడు బియ్యాన్ని దంచి దాంతో అన్నం వండి, ఆకుకూరలు, కాకరకాయ వేపుడు తదితర పదార్థాలను గురువుకు సమర్పించారు. శిష్యులు సమర్పించిన ఆ ఆహారపదార్థాలను స్వామివారు సంతోషంగా స్వీకరించారు. కనుకనే ఈ ఆలయంలో స్వామివారికి పొయ్యిమీద నుంచి దించిన వేడివేడి ఉప్పుడు బియ్యం అన్నాన్ని స్వామి సన్నిధికి తీసుకెళ్ళి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆవిర్లు కక్కుతున్న ఆ వేడి అన్నం స్వామివారికి నైవేద్యంగా పెట్టి గర్భాలయం తలుపులు కాసేపు మూసి తెరుస్తారు. అరూపుడైన స్వామివారి ఆ అన్నాన్ని ప్రీతిగా స్వీకరించినట్లు ఆవిర్లు మాయమై అన్నం చల్లబడి పోతుంది. ఆ తర్వాత ఉదయం 11 గంటలకు అత్తిరసాలు, దోసెలు, పాయసం, జంతికలు, వడలు, పిట్లు ఇలా తీపి పదార్థాలను స్వామివారికి సమర్పిస్తారు. సంక్రాతి రోజున అరటి ఆకులో 16 రకాల కాయగూరలతో చక్కెర పొంగలి, నేతి పొంగలి నైవేద్యంగా సమర్పిస్తుంటారు.

అరూపంలో అమ్మవారు...

దక్షయజ్ఞానికి పతిదేవుడైన పరమశివుడి ఆజ్ఞను ధిక్కరించి వెళ్ళి యాగగుండంలో ఆహుతైన అమ్మవారు ఇక్కడ స్వరూపరహితురాలై తపమాచరించారు. ఆ కారణంగానే ఆలయంలో అమ్మవారికి విగ్రహం ఉండదు. అమ్మవారు తపమాచరించినప్పుడు ఇక్కడ నమోదైన ఆమె పవిత్ర పాదాలకు మాత్రమే నిత్యపూజలు నిర్వహిస్తుంటారు. ఈ పాదాలను భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆ పాదాలు ప్రతిబింబించేలా ఓ అద్దాన్ని అమర్చారు. ఇక్కడి అమ్మవారి సన్నిధి తలపులు ఎల్లప్పుడూ మూసి ఉంచుతారు. సన్నిధి ముందు కిటికీ గుండా అద్దంలో అమ్మవారి పాదాలను భక్తులు దర్శించుకుంటారు. అమ్మవారి సన్నిధి ఎదుట ఉన్న ఊయలకు మహిళలు గాజులు కట్టి మొక్కుకుని సంతాన భాగ్యం పొందుతున్నారు. ఇక ఈ ఆలయంలో సూర్యగ్రహణం, చంద్రగ్రహణం రోజుల్లోనూ అరూపుడైన పరమేశ్వరుడికి ఆరుకాల పూజలు నిరాటంకంగా నిర్వహిస్తుంటారు. ఆద్యంతరహితుడు, స్వరూపరహితుడైన పరమేశ్వరుడికి ఏ పరిస్థితుల్లో పూజాది కార్యక్రమాలకు ఆటంకం ఉండకూడదనే భావనతోనే గ్రహణ కాలాల్లోనూ ఆలయంలో పూజలు జరుగుతాయి.

నిలిచే దేవతలు..

గురువున్న చోట శిష్యులు భక్తి ప్రపత్తులతో నిలిచి ఉండటం ఆనవాయితీ. ఈ ఆలయంలో ఆత్మనాధుడికి ఎదుట మాణిక్యవాసగర్, చొక్క వినాయకుడు, మురుగన్, వీరభద్రుడు నిలిచే భంగిమలోనే దర్శనమిస్తున్నారు.

స్తంభాల్లో నవగ్రహాలు...

ఆవుడయార్ ఆలయంలో నవగ్రహాలకంటూ ప్రత్యేక సన్నిధి లేదు. అయితే ఆలయంలో నవగ్రహస్తంభాలున్నాయి. మొదటి స్తంభంలో రాహువు, కేతువు, రెండో స్తంభంలో శనీశ్వరుడు, గురుడు, శుక్రుడు, అంగారకుడు, మూడో స్తంభంలో ఉషా, ప్రత్యూషా, సూర్య భగవానుడు, బుధుడు, నాలుగో స్తంభంలో చంద్రుడి రూపాలు చెక్కబడి ఉన్నాయి. ఈ స్తంభాలకు సమీపంలోని మరో రెండు స్తంభాలో శ్రీకాళహస్తీశ్వరుడు, గంగాదేవి ఆకారాలు చెక్కబడి ఉన్నాయి. ఇదేవిధంగా ఆలయ ప్రాంగణంలోనే వేయి స్తంభాల మండప సౌందర్యాన్ని చాటేలా రెండు స్తూపాల్లో 500 చొప్పున చెక్కిన స్తంభాల సౌందర్యం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.


సప్తస్వరాలు పలికే స్తంభాలు


మాణిక్యవాసగర్

అన్నపూర్ణమ్మతో వినాయకుడు...

ఆత్మనాధుడి గర్భాలయ ప్రహరీలో రెండో ప్రాకారంలోని నాలుగు దిక్కులా నాలుగు వినాయక విగ్రహాలున్నాయి. వీరిలో ఓ వినాయకుడు అన్నపూర్ణాదేవితో ఉత్తరాభిముఖంగా దర్శనమిస్తారు. ఈ వినాయకుడిని దర్శిస్తే ఇంటిలో ధన ధాన్యాలకు కొదువ లేకుండా ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తారు. మరో వైపు దక్షిణాభిముఖంగా ఉన్న వినాయకుడు నర్తన భంగిమలో ఉన్నారు. ఆ వినాయకుడి దిగువ శివగణాల్లోని ఇద్దరు నృత్యం చేస్తుంటారు.

ఆలయ విశేషాలు..

ప్రతియేటా ఆణి తిరుమంజనం ఉత్సవాలు పది రోజులపాటు నిర్వహిస్తారు. ఆ వేడుకలకు సుమారు యాభైవేల మంది భక్తులు హాజరవుతారు. మార్గళి తిరువాదిరై (తిరువెంబావై) ఉత్సవాలు పది రోజులపాటు జరుగుతాయి. ఈ రెండు ఉత్సవాలు అత్యంత ప్రధానమైన ఉత్సవాలు. ఆణి మాస ఉత్సవాల్లో మాణిక్యవాసగర్‌కు ప్రాధాన్యతనిచ్చి వేడుకలు జరుపటం విశేషం. ఈ ఉత్సవాన్ని స్వామివారికి ప్రాధాన్యం లేకుండా మాణిక్యవాసగర్‌కు ప్రాధానత్య కల్పించడం వల్ల ఈ ఉత్సవాన్ని భక్తోత్సవం అని భావించకూడదని, మాణిక్యవాసగరే పరమేశ్వరుడిగా వెలుగొందుతున్నారని భావించాలని పండితులు చెబుతారు. ఈ వేడుకల్లో రథోత్సవంలో మాణిక్యవాసగర్ పాల్గొంటారు. కార్తీక మాసం చివరి సోమవారం, ఆషాఢ శుక్రవారం, తై మాస శుక్రవారం, ఆణి మఖం రథోత్సవం, శివరాత్రి, పంగుణి ఉత్తిరం, స్కంధషష్టి, కార్తీకదీపం, నవరాత్రి ఉత్సవాలు కూడా అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

ఎలా వెళ్ళాలి?

చెన్నై నుంచి పుదుకోటకు రాష్ట్ర రవాణా సంస్థ బస్సుల్లో వెళ్ళి, అక్కడి నుండి అరంతాంగికి వెళ్ళి అక్కడ నుంచి సిటీ, టవున్ బస్సులు, టాక్సీలు, ఆటోల్లో ఆవుడయార్ కోవిల్ ప్రాంతానికి చేరుకోవచ్చు. తిరుచ్చి నుండి 100 కి.మీ.లు, పుదుకోట నుండి 46 కి.మీలు, అరంతాంగి నుండి 13 కి.మీలు, తంజావూరు నుంచి 102 కి.మీల దూరంలో ఈ శైవక్షేత్రం ఉంది. ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంతం 4 నుండి రాత్రి 9 గంటల వరకు ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఆలయ వైభవం...

ఆవుడయార్ ఆలయం లేదా ఆత్మనాథర్ ఆలయం ప్రాచీన అద్భుత శిల్పకళలకు పెట్టింది పేరు. ఇక్కడి రెండో ప్రాకారంలో ఉన్న థిల్లై మండపంలో అర్జునుడికి పరమశివుడు పాశుపతాస్త్రాన్ని అందిస్తున్న పరమేశ్వరుడి విగ్రహం, అమ్మవారి విగ్రహం కనిపిస్తాయి. అమ్మవారి విగ్రహం కంఠంలో హారం, చేత మెలివేసిన గాజులు, నేటి ప్లాస్టిక్ దారాల అల్లికతో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌లో ఓ సంచితో ఉంటారు. ఇవి కాకుండా నివర్తికళ, ప్రతిభాకళ, విద్యాకళ, కాంతికళ, శాంతి కళ ఇలా పంచ కళలను పంచాక్షర మండపంలో పైభాగాన శిల్పాకారంలో చూడవచ్చు. ఈ శివాలయాన్ని దర్శించే భక్తులకు గురువుల అనుగ్రహం కలుగుతుంది. ఇక్కడి ఆత్మనాథర్ స్వామిని దర్శిస్తే విద్య, జ్ఞానం లభిస్తాయి. వ్యాపారాభివృద్ధి, ఉద్యోగంలో ఉన్నత స్థితి, వివాహ యోగం, సంతానభాగ్యం కలగుతాయి.

దక్షిణాభిముఖ ఆలయం...

సాధారణంగా శివాలయాలు తూర్పు, పడమటిదిశగా ఉంటాయి. అయితే ఆవుడయార్ కోవిల్ వాటికన్నింటికీ భిన్నంగా దక్షిణాభిముఖంగా నిర్మితమై ఉండటం విశేషం. పరమేశ్వరుడు గురువుగా దక్షిణదిశగా ఆశీనులైన ఉపదేశించే విధంగా ఉన్న రూపాన్ని 'దక్షిణామూర్తి' అని పిలుస్తారు. అయితే ఈ క్షేత్రం మాణిక్యవాసగర్‌కు ఉపదేశం చేసిన క్షేత్రం గనుక ఆలయం దక్షిణదిశగా నిర్మించారని చెబుతారు. ఆవుడయార్ కోవిల్‌తోపాటు కరూరు జిల్లా కుళిత్తలై కదంబవన నాథర్ ఆలయం కూడా దక్షిణాభిముకంగానే నిర్మించారు.. అంతరాలయంలోని స్తూపాలపై కేరళ, మరాఠీ, గ్రీకు, అరేబియా ప్రాంతాలకు చెందిన మేలుజాతి అశ్వ శిల్పాలు కూడా వెయ్యేళ్ల క్రితమే చెక్కబడి ఉండటం ఉండటం మరీ విశేషం.


మీడియా సమావేశంలో చిత్ర బృందం

నేడు 'కురంగు పెడల్' రిలీజ్

చిత్రజ్యోతి

ప్రముఖ నటుడు శివకార్తికేయన్ సమర్పిస్తున్న చిత్రం 'కురంగు పెడల్' శుక్రవారం విడుదలవుతోంది. 'మదుపానకడై', 'వట్టం' వంటి పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన కమలకన్నన్ ఈ చిత్రానికి దర్శకత్వం చేశారు. కాళి వెంకట్ ప్రధాన పాత్ర పోషించారు. సంతోష్ నారాయణన్, వీఆర్ రాఘవన్, ఎం.జ్ఞానశేఖర్ తదితరులు నటించారు. సినిమా విడుదలను పురస్కరించుకుని చిత్ర బృందం మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. 'ఈ సినిమా తనకు ఎంతో ముఖ్యమైనది. తన జీవితంలోని అనేక ముఖ్య సంఘటనలు ఇందులో ఇమిడివున్నాయని నటుడు కాళి వెంకట్ పేర్కొన్నారు. సంగీత దర్శకుడు జిబ్రాన్ మాట్లాడుతూ, 'ఈ మూవీ తనకు బాగా కనెక్ట్ అయింది. మీసాలు రాక ముందే పెద్దవాడివయ్యావని గుర్తు చేసేదే సైకిల్. 'వాగై సూడవా' చిత్రం తర్వాత గ్రామీణ నేపథ్యంతో కూడిన చిత్రానికి సంగీతం అందించడం ఇదే తొలిసారి. ఈ సినిమాను అందించిన శివకార్తికేయన్‌కు ధన్యవాదాలు' తెలిపారు. 'సినిమా విడుదలకు ముందే ప్రేక్షకుల్లో మంచి పబ్లిసిటీ రావడానికి కారణం శివకార్తికేయన్. ఆయన సొంత సినిమాగా భావించి పూర్తి చేశారు. ఒక మంచి సెన్సిబులిటీతో కూడిన సినిమాను తెరకెక్కించామన్న దర్శకుడు కమలకన్నన్ మీడియా సహకారం అందించాలని కోరారు. నిర్మాత సవిత మాట్లాడుతూ, 'కథ వినగానే సెట్స్‌పైకి తీసుకెళ్ళాం. నాకు ఎంతగానో కనెక్ట్ అయింది. సైకిల్ ప్రతి ఒక్కరి పురోభివృద్ధిలో ఒక ముఖ్యభాగం. ముఖ్యంగా మహిళలకు పలు రకాలైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చింది' సైకిల్ అని అన్నారు.

కోలీవుడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. యువ సంగీత దర్శకుడు, సీనియర్ గాయని మృతి చెందడం తమిళ సినీ పరిశ్రమ వర్గాలను విచారంలోకి నెట్టివేసింది. మరణించిన వారిలో ఒకరు యువ సంగీత దర్శకుడు ప్రవీణ్‌కుమార్ కాగా, మరొకరు ప్రముఖ నేపథ్యగాయని ఉమా రమణన్. వీరిద్దరూ అనారోగ్యంతో మృతి చెందారు. - అడయార్

కోలీవుడ్‌లో విషాదం
రెండురోజుల్లో ఇద్దరు సంగీత కళాకారుల మృతి


ప్రవీణ్ కుమార్ (ఫైల్‌ఫోటో)

యువ సంగీత దర్శకుడు ప్రవీణ్ కుమార్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ట్రిప్లికేణిలోని ఓమందూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 2021లో ఎల్టీటీఈ చీఫ్ వేలుపిళ్ళై ప్రభాకరన్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'మేదకు' చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయమైన ప్రవీణ్ ఆ తర్వాత మరికొన్ని చిత్రాలకు సంగీతం అందించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. బుధవారం ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఈ యువ సంగీత దర్శకుడి మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రవీణ్ అంత్యక్రియలు గురువారం సాయంత్రం పూర్తిచేశారు.

ప్రఖ్యాత గాయనిగా గుర్తింపుపొందిన ఉమా రమణన్ (69) బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. చిత్రపరిశ్రమలో ప్రత్యేకశైలితో పాటు గాత్రాన్ని కలిగిన ఉమ అడయారులో తన కుటుంబతో కలిసి నివసిస్తున్నారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్న ఆమె... బుధవారం రాత్రి స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఏవీ రమణన్ బృందంలో పాటలు పాడిన ఉమ... చివరకు ఆయనను ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. 1978లో వచ్చిన 'కృష్ణలీలై' చిత్రంలో తొలిసారి అవకాశం దక్కించుకుని నేపథ్యగాయనిగా చిత్రపరిశ్రమకు పరిచయమయ్యారు. ఆ తర్వాత ఇసైజ్ఞాని ఇళయరాజా సంగీతం దర్శకత్వం లో దాదాపు వందకుపైగా చిత్రాల్లో ఆమె నేపథ్యగానం చేశారు. సినిమాల్లోనే కాకుండా, తన భర్త రమణన్‌తో కలసి ఆరు వేలకుపైగా సంగీత విభావరి కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. భర్తతో కలిసి కూడా పలు చిత్రాలకు నేపథ్యగానం కూడా చేశారు. అంతే కాకుండా కొన్ని చిత్రాల్లో ఆమె క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించారు. సినిమా, తమ సొంత కచ్చేరిలు మినహా ఇతర కార్యక్రమాలకు ఆమె దూరంగా ఉన్నారు. ఆమె కెరీర్‌లో మీడియాకు ఒక్క ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వకపోవడం గమనార్హం. తమిళం మినహా ఏ ఇతర బాషల్లో కూడా ఆమె పాడలేదు. అయితే, తన భర్త రమణన్‌తో కలిసి 'ప్లేబాయ్' అనే హిందీ చిత్రానికి నేపథ్యగానం చేశారు. ఆమె తొలిసారి 1977లో 'శ్రీకృష్ణ లీల' చిత్రానికి నేపథ్యగానం చేయగా, చివరగా 2005లో వచ్చిన 'తిరుపాచ్చి' సినిమాలో పాడారు. ఆమె మృతి వార్తపై పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆమె అంత్యక్రియలను గురువారం పూర్తి చేశారు.



భర్త ఏవీ రమణన్‌తో ఉమ (ఫైల్‌ఫోటో)

నటుడు కృష్ణ సరసన మలయాళ నటి


ఆదిత్య ప్రసాద్

విలక్షణమైన కథలతో పాటు పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్ సాఫీగా కొనసాగిస్తూ ప్రేక్షకుల మనస్సుల్లో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్న నటుడు కృష్ణ. తాజాగా మరో కొత్త చిత్రానికి కమిట్ అయ్యారు. ఇందులో ఆయన సరసన మలయాళ నటి ఆదిత్య ప్రసాద్ హీరోయిన్‌గా నటించనుంది. నెంజుండప్ప రెడ్డి బ్రదర్స్ సమర్పణలో ఈవీఈజీ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానరుపై ప్రొడక్షన్ నెం.1 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కే. ఈ చిత్రం ద్వారా దురై శరవణన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం నుంచి చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో జరుపుకోనుంది. ఈ ప్రాజెక్టు గురించి నిర్మాతలు మాట్లాడుతూ, హోసూర్‌లో తమ వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. సినిమాలపై ఉన్న మక్కువతోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాం. మంచి కంటెంట్ ఆధారిత ఎంటర్‌టైన్మెంట్ చిత్రాలను రూపొందించేందుకు సిద్ధంగా ఉన్నాం. మేం ప్రారంభించిన తొలి ప్రాజెక్టు వినోదాత్మకంగా అన్ని వయస్సుల వారిని ఆకట్టుకునేలా ఉంటుంన్నారు. ఇందులో కృష్ణ, ఆదిత్యతో పాటు మారన్, ఇమ్మాన్ అన్నాచ్చి, ఆదిత్య కదిర్, చామ్స్ ఏ.వెంకటేష్ నటిస్తుండగా, నూతన నటుడు సంతోష్ విలన్‌గా నటిస్తున్నారు. ఎస్ఆర్ సతీష్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించే ఈ చిత్రానికి శ్రీకాంత్ దేవా సంగీతం.

అర్జున్ దాస్ - తాన్య జంటగా 'రసవాది'


'రసవాది'లో అర్జున్ దాస్, తాన్య రవిచంద్రన్

విలక్షణ నటుడు అర్జున్ దాస్, తాన్య రవిచంద్రన్ జంటగా నటించిన చిత్రం 'రసవాది' - (ది ఆల్‌కెమిస్ట్). ఈ నెల 10న విడుదలకానుంది. 'మౌనగురు', 'మహాముని' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన శాంతకుమార్ ఈ చిత్రానికి దర్శకుడు. లవ్, యాక్షన్, క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కించారు. ఈ చిత్రం గురించి దర్శకుడు శాంతకుమార్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని తన సొంత బ్యానరు డీఎన్‌ఏ మెకానిక్ కంపెనీ పతాకంపై తెరకెక్కించి పదో తేదీన విడుదల చేస్తున్నామన్నారు. మదురై, కడలూరు తదితర ప్రాంతాల్లో 50 రోజుల్లో చిత్రీకరణ పూర్తిచేసి ఇటీవలే ట్రైలర్ రిలీజ్ చేశామని శక్తి ఫిల్మ్ ఫ్యాక్టరీ విడుదల చేస్తున్నట్టు వివరించారు. కథ పరంగా పరిశీలిస్తే కొడైక్కెనాల్‌లో 30 యేళ్ళ సిద్ధ వైద్యుడు ప్రశాంతమైన జీవితం గడుపుతుంటారు. కొడైక్కెనాల్‌లో ఒక యువతిని చూస్తారు. అప్పటి నుంచి పాత కష్టాలు తొలగిపోతాయి. కానీ, స్థానికంగా ఉండే పోలీస్ ఇన్‌స్పెక్టర్ వల్ల కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఆ సమస్యలు ఏమిటి? వాటికి హీరోకు సంబంధం ఏమిటి? అన్నదే ఈ చిత్ర కథ. ఇందులో అత్యంత కీలకమైన ఆరు పాత్రలు చుట్టూ స్క్రిప్టుసాగుతుంది. కథ డిమాండ్ మేరకు ఫైట్ సన్నివేశాలుం టాయి. అర్జున్ దాస్ మంచి నటుడు. సొంత సినిమా కావడంతో అనుకున్న సమయంలో చిత్రీకరణ పూర్తి చేశాం. నటి రమ్యను గతంలో ఎన్నడూ చూడని ఓ మంచి పాత్రలో చూస్తారు. ఎస్.థమన్ సంగీతం అందించారు' అని వివరించారు.


డాక్టర్ ఆశాలత

ఆ ఇద్దరూ ఏమయ్యారు?

ఐదేళ్ల కిందట తిరుపతి నగరంలో ఇద్దరు డాక్టర్లు నిరంతరం వార్తల్లో వ్యక్తులుగా ఉండేవారు. రాజకీయ ఉత్సాహంతో క్రియాశీలకంగా కనిపించేవారు. ఏమైందో ఏమో ఎన్నికల వేళ ఆ ఇద్దరి ఊసే తిరుపతిలో వినిపించడం లేదు. ఇద్దరిలో ఒకరు వైసీపీలో చేరాక ఉనికిని కోల్పోగా మరొకరు చేరడానికి వెళ్లి అనాదరణకు గురై మౌనంగా ఉండిపోయారు. సాయిసుధా హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి 2010 సమైక్యాంధ్ర ఉద్యమానికి సారథిగా రాష్ట్రవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. టీడీపీ ఆరోగ్య విభాగం అధ్యక్షురాలిగా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ ఏ పని అప్పగించినా ఖర్చుకు వెనుకాడకుండా ఘనంగా నిర్వహించేవారు. భర్త డాక్టర్ సుకుమార్‌కు తిరుపతి ఎంపీ టికెట్ ఆశించి నిరాశపడిన సుధారాణి, తన భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందనే నమ్మకంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరారు. అంతే ఆ తర్వాత ఆమె ఉనికి రాజకీయాల్లోంచి మాయమైంది. ఇప్పుడా పార్టీలో ఉన్నారో లేదో కూడా తెలియని స్థితి. తిరుపతిలో ప్రసిద్ధ గైనకాలజిస్టుగా, టెస్ట్‌ట్యూబ్ బేబీ వైద్యనిపుణురాలుగా పేరు తెచ్చుకున్న డాక్టర్ రాయ ఆశాలత 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు సమక్షంలో తన భర్త వెంకటేశ్వర్లుతో సహా టీడీపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించి విఫలమవడంతో టీడీపీకి దూరమయ్యారు. అధికారంలోకి వచ్చిన వైసీపీలో అయినా తమ భవిష్యత్తును వెతుక్కుందామని ఆశపడ్డారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన భూమన కరుణాకర్ రెడ్డిని అభినందించేందుకు పుష్పగుచ్ఛం తీసుకుని ఆయన ఇంటికివెళ్లారు. అక్కడ వీరికి నిరాదరణ ఎదురవడంతో నిశ్శబ్దంగా వెనక్కివచ్చేశారు. ఎన్నికల సమయంలో తమ ఇంటికి వచ్చి సాయం కోరిన భూమన కరుణాకరరెడ్డి గెలిచాక ఇలా వ్యవహరించడంతో ఈ దంపతులు రాజకీయాలకే దణ్ణం పెట్టి దూరంగా ఉండిపోయారు.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి


డాక్టర్ సుధారాణి



ఇదీ మందు

మనోడ్ని నమ్మొచ్చా?



ఎన్నికల తేదీ దగ్గరయ్యే కొద్దీ అభ్యర్థుల ఒంట్లో జ్వరం పెరుగుతోంది. బింకం సడలుతోంది. ఇగో కాస్త పక్కన పెట్టి కాళ్ల బేరాలకీ దిగేస్తున్నారు. రేణిగుంట మండలంలో కొద్ది రోజులుగా వైసీపీలో ఈ వాతావరణం కనిపిస్తోంది. నాయకుడి ధోరణితో ఐదేళ్లుగా ఆ పార్టీ స్థానిక నాయకులే విసిగిపోయారు. నాయకుడి ప్రత్యేక అనుచరులు భూకబ్జాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు సాగాయి. బాధితులు స్థానిక నేతలను ఆశ్రయించేవారు. పార్టీకి చెడ్డపేరు వస్తుందని స్థానిక నేతలు నాయకుడి దగ్గర వాపోయేవారు. 'అదంతా నేను చేసుకుంటా.. మీరు జోక్యం చేసుకోవద్దు' అని ఆయన ఖరాకండీగా చెప్పేసేవారు. మరోదారి లేక అన్నీ దిగమింగుకుని మౌనంగా పార్టీలోనే ఉండిపోయినవారిలో కొందరు ఇప్పుడు పార్టీ మారడం మొదలుపెట్టారు. మరికొందరు అభ్యర్థి కోసం పనిచేయడానికి ముందుకు రావడంలేదు. పరిస్థితి గమనించిన నాయకుడు 'తప్పు చేశాను.. మరోసారి చేయను.. పార్టీ మారద్దు.. ఈ సారికి సహకరించండి' అంటూ స్వపక్ష నేతలనే బతిమలాడుకుంటున్నారు. బుజ్జగింపులతో దారిలోకి వచ్చి ఎన్నికల బాధ్యతలు స్వీకరించిన వారినీ ఆయన నమ్మడం లేదు. వారి కదలికలను నిరంతరం గమనించేందుకు షాడో పార్టీలను ఏర్పాటు చేశారనే ప్రచారం జరుగుతోంది. దీంతో నాయకుడి మాటలు నమ్మచ్చా లేదా తేల్చుకోలేక రేణిగుంట మండలంలోని వైసీపీ నేతల్లో గందరగోళం నెలకొందని అంటున్నారు.

- రేణిగుంట

నోటికాడ కూడు లాగేసిన జగన్....



జగన్ అధికార పగ్గాలు చేపట్టిననాటి నుంచి కక్షపూరిత నిర్ణయాలు తీసుకుంటూనే ఉన్నారనడానికి ఈ చిత్రమే సాక్ష్యం. పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం స్థానిక పాత బస్టాండు సమీపంలో అన్నాక్యాంటీన్‌ను ఏర్పాటు చేసింది. నాడు నిత్యం అన్నదానసత్రంలా ఇది కళకళలాడింది. ఈ ప్రాంతంలో రెవెన్యూ, మండల, ఆర్‌అండ్‌బీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో ఎందరో వివిధ పనులపై వచ్చేవారు. వారితో పాటు స్థానిక కూలీలు కూడా వచ్చి రూ.5లకే కడుపునిండా భోజనం చేసేవారు. వందలాది మంది ఆకలి తీర్చిన ఈ అన్నక్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసివేశారు. ప్రస్తుతం ఈ భవనాన్ని బొగ్గులదిబ్బ ప్రాంత సచివాలయ కార్యాలయంగా మార్చేశారు. దీనిని చూసినప్పుడల్లా పేదల నోటికాడ కూడు లాగేసుకున్న జగన్ సర్కారు తీరుపై పేదలు శాపనార్థాలు పెడుతుంటారు.

- గూడూరు

నాయకుల కాళ్లకు చెప్పులుండేవి కాదు



"ప్రజల కోసం పనిచేయాల్సిన నాయకులు మాట్లాడుతున్న భాష చూస్తే బాధేస్తోంది. ఒకప్పుడు ఓట్లకి డబ్బులు పంచుతారన్న మాటే

● మా రోజుల్లో...

వినబడేది కాదు. ఇప్పుడు వాళ్ళు ఎంత ఇస్తారు... వీళ్ళు ఎంతిస్తారు అనే మాటలే వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో రోజురోజుకీ పరిస్థితులు మారిపోతూనే ఉన్నాయి. పూర్వం కాళ్లకు చెప్పులు లేని నేతలు కూడా ఉండేవారు. ప్రచార ఖర్చులకు డబ్బులుండేవి కావు. నమస్కారంతో ఓటు అడిగేవారు. ఇప్పుడు ఓట్లడగడానికి కూడా ఊరేగింపు గా రావడం విచిత్రంగా ఉంది."

- రామచంద్రా రెడ్డి (82), వేలవేడు, శ్రీకాళహస్తి మండలం

- శ్రీకాళహస్తి




వేతనాల కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది (ఫైల్)

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు: 2,492
సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలు: 1060
అద్దె భవనాల్లో ఉన్నవి: 1432
పనిచేస్తున్న కార్యకర్తల సంఖ్య: 2,468
లబ్ధి పొందుతున్నవారు: 1,36,390

నగరికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు ఇద్దరు పిల్లలు. అద్దె ఇల్లు. ఆమె భర్త ఆటో నడుపుతాడు. ఈ పరిస్థితుల్లో వీరి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలేవీ వర్తించడం లేదు. పిల్లల చదువుకు అమ్మఒడి పథకం కూడా అందడం లేదని ఆమె వాపోతోంది. జగన్ అధికారంలోకి వచ్చాక కక్ష కట్టి తమకు పథకాలు ఏవీ అందకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

గూడూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు భర్త అనారోగ్యంతో చనిపోయాడు. ఈమె కొద్దిపాటి జీతమే ఇంటిల్లిపాదికీ ఆధారం. ఈమెకు ఇద్దరు పిల్లలున్నారు. భర్తను కోల్పోయిన అత్త కూడా ఈమెతోనే ఉంటోంది. అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నందున వితంతు పింఛను కూడా రాదని చెప్పడంతో కుటుంబాన్ని నడపడానికి నానా యాతనా పడుతోంది.



నేను విన్నాను.. నేను మరిచాను

● హామీలతో అంగన్‌వాడీలను ముంచేసిన జగన్ ● ఐదేళ్లలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెరుగుదల
● టీడీపీ హయాంలో మెరుగైన వేతన పెంపు

జగన్ తీపి మాటలు విని నిలువునా మోసపోయామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక హామీల సంగతి పక్కన పెడితే పనిభారం మోపి, అప్పటి వరకు వర్తించిన సంక్షేమ పథకాలను తొలగించారంటూ నిప్పులు చెరుగుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క సమస్యను పరిష్కరించిన పాపాన పోలేదు. దీనికితోడు రకరకాల యాప్‌లు, సర్వేల పేరుతో పనిభారాన్ని మోపడంతోపాటు చాలీచాలనీ వేతనాలతో నాలుగున్నరేళ్లు అంగన్‌వాడీలకు నరకం చూపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 42 రోజుల పాటు సమ్మె చేస్తే కనికరం లేకుండా ఉక్కుపాదంతో అణచివేశారు. మహిళలని చూడకుండా పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. ఎస్మా, ఉద్యోగాల తొలగింపు వంటి అస్త్రాలతో భయపెట్టి విధుల్లో చేరేలా చేశారని కార్యకర్తలు జగన్‌ను తూర్పారబెడుతున్నారు. ఇప్పటికీ సమ్మె కాలానికి పూర్తిగా సొమ్ము చెల్లించలేదని, మెనూ ఛార్జీలు పెంచకుండా వైసీపీ ప్రభుత్వం చేతిలో దగా పడ్డామని ఆవేదన చెందుతున్నారు.

అన్నొస్తాడు... మీకు మంచి చేస్తాడు..
తెలంగాణ ప్రభుత్వం కంటే రూ. వెయ్యి అదనంగా జీతం పెంచుతాను. మీ సమస్యలన్నీ తీరుస్తాను.
గత ఎన్నికల సందర్భంగా అంగన్‌వాడీలకు జగన్ చెప్పిన మాట ఇది.

టీడీపీ హయాంలోనే నయం

● 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కార్యకర్త వేతనాన్ని రూ.4,500 నుంచి రూ.10,500 వరకూ పెంచారు. ఆయాల వేతనాన్ని రూ.2,200 నుంచి రూ. 6 వేలకు పెంచారు. ఏకంగా 150 శాతం పెంచారు. జగన్ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచిందని సిబ్బంది పెదవి విరుస్తున్నారు.

సమ్మె వేతనం మాటేమిటి

● గతేడాది డిసెంబరు 12 నుంచి ఈ ఏడాది జనవరి 22 వరకు అంగన్‌వాడీలు సమ్మె చేశారు. ప్రభుత్వ చర్చల్లో భాగంగా సమ్మె కాలానికి వేతనం ఇస్తామంటూ సీఎం జగన్ హామీ ఇచ్చారు. జీవో కూడా జారీ చేశారు. కానీ నేటికీ అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్పా ఆ ఊసే లేదు. ఐదేళ్లుగా కూరగాయలు, నిత్యావసరాలు, టీఏ, డీఏ బకాయిల గురించి పట్టించుకోవడం లేదు.

సమ్మెకు బహుమతి ఇది

సమ్మె సందర్భంగా 3,400 మంది అంగన్‌వాడీలకు పోలీసులు నోటీసులిచ్చారు. 2,040 మందిని గృహ నిర్బంధం చేశారు. 70 మందిపై బైండోవర్లు నమోదు చేశారు. 120 మందినీ అరెస్టు చేశారు. సీఎం జగన్ తమకు ఇచ్చిన కానుక ఇదేనని అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

నాసిరకం ఫోన్లు... పనిచేయని యాప్‌లు

వైసీపీ పాలనలో పలు రకాల యాప్‌లు తీసుకువచ్చింది. అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్లు మాత్రం నాసిరకంగా ఉన్నాయి. యాప్‌లు, ఫోన్లు సరిగా పనిచేయక లబ్ధిదారుల వివరాలను నమోదు చేయలేక అంగన్‌వాడీలు ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాలు నమోదు చేస్తే కానీ పోషకాహారం విడుదల రాదు. యాప్‌లు పని చేయక, ఫోన్లకు సిగ్నల్ రాక సకాలంలో పోషకాహారం అందించలేక నానా మాటలు పడుతున్నామని కార్యకర్తలు వాపోతున్నారు.

- తిరుపతి(వైద్యం)




అమానుషంగా ప్రవర్తించడం బాధాకరం

అంగన్‌వాడీల జీతాలను పెంచకపోవడం దారుణం. ఐదేళ్లలో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెంచడం అన్యాయం. చాలీచాలని జీతాలతో బతకలేక రోడ్డెక్కిన అంగన్‌వాడీలను పోలీసులతో ఈడ్చిపడేయటం, కేసులు నమోదు చేయడం దారుణం. అంగన్‌వాడీల విషయంలో జగన్ ప్రభుత్వ తీరు అమానుషం. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడమేనా అక్కాచెల్లెమ్మలపై సీఎం జగన్‌కు ఉన్న గౌరవం.

- వాణిశ్రీ, అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నోట్ దిస్ పాయింట్


కరపత్రాల ప్రింటింగ్‌కు అనుమతి ఉండాల్సిందే



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలది కీలకపాత్ర. ఓటర్లను బలంగా ప్రభావితం చేసే ప్రచార సాధనమిది. అందుకే దీని ముద్రణ విషయంలో ఎన్నికల కమిషన్ చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ క్రమంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127 ప్రకారం కేసులు నమోదు చేస్తారు. అవసరమైతే జైలుకు పంపుతారు. ఉదాహరణకు ప్రింట్ చేయాల్సిన ఫ్లెక్సీలు, కరపత్రాల నమూనాలను ప్రింటర్ తన పరిధిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఈ అభ్యర్థనపై ఇద్దరు సాక్షులు సంతకం చేయాల్సి వుంటుంది. ఆ అధికారి వాటిని నిశితంగా పరిశీలిస్తారు. అప్పుడు ప్రింట్ చేసేందుకు అనుమతితో కూడిన డిక్లరేషన్ ఇస్తారు. డిక్లరేషన్ పొందిన తరువాత మాత్రమే ప్రింట్ చేయాలని ఎన్నికల చట్టం స్పష్టం చేస్తోంది. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రింటరే కాదు అభ్యర్థి కూడా ఆరు నెలలు జైలు శిక్ష,లేకుంటే రూ.2000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

- తిరుపతి(నేరవిభాగం)

వీడియోగ్రాఫర్ల ఓటు మిస్



ఈసారి ఓటేసే అవకాశం మిస్సవుతున్నామని జిల్లాలో 400 మందికి పైగా వీడియోగ్రాఫర్లు బాధపడుతున్నారు. ఎన్నికల సందర్భంగా రకరకాల వీడియోలు తీయడానికి నియోజకవర్గానికి సుమారు 60 మంది ప్రయివేట్ వీడియోగ్రాఫర్లను ఎన్నికల అధికారులు నియమించారు. సాధారణంగా ఎన్నికల విధుల్లో ఉండే జర్నలిస్టులకు ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవకాశం కల్పించింది. ఆ కోటాలో తాముకూడా ఓటు వేయవచ్చని భావించిన వీడియోగ్రాఫర్లకు భంగపాటు ఎదురైంది. పోస్టల్ బ్యాలెట్ గడువు ముగియడం, అధికారులు ఐడీ కార్డులు జారీ చేయకపోవడంతో ఓటు వినియోగించుకోలేక పోతున్నామని వీరంతా ఆవేదన చెందుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

బుజ్జగింపులకే పుణ్యకాలం సరి..

వైసీపీలో విభేదాల పంచాయతీలు కొలిక్కి రావడం లేదు. ఒక పక్క గడువు ముంచుకొస్తున్నా నగరి వైసీపీ అభ్యర్థి రోజా ఎన్నికల ప్రచారం మీద దృష్టిసారించలేక పోతున్నారు. పుణ్యకాలం కాస్తా పార్టీ అంతర్గత విభేదాల పరిష్కారానికే సరిపోతోంది. కుటుంబ సభ్యులకు ప్రచార బాధ్యతలను అప్పగించి ఆమె అసమ్మతి నాయకుల అనుచరులను మచ్చిక చేసుకునే పనిలో బిజీగా గడుపుతున్నారు. ఒక్కొక్కరికి ఒకటి పదిసార్లు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. వీలైనంత వరకు నగరిలోని తన ఇంటికి పిలిపించుకుని బుజ్జగించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. నింద్రకు చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధిని తనవైపు తిప్పుకునేందుకు ఏకంగా ఐదుసార్లు ఆమె ఇంటికి వెళ్లాల్సివచ్చింది. దీంతో ఆ మహిళా ప్రజాప్రతినిధి ఎట్టకేలకు మంత్రి రోజాను నగరిలో కలిసి మద్దతు ప్రకటించింది. ఒక్కొక్కరి ఇంటి చుట్టూ ఇన్నిన్ని సార్లు తిరగాల్సి రావడం మంత్రి క్యాంప్‌లోని వైసీపీ నాయకులకు తలనొప్పిగా మారిందనే మాటలు వినబడుతున్నాయి. దీంతో ప్రచార పర్వంలో మంత్రి రోజా వెనుకబడ్డారని నియోజకవర్గ ఓటర్లు గుసగుసలాడుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్



ఈ పోలింగ్ స్టేషన్లు స్పెషల్ ...



దివ్యాంగులు, మహిళలు,యువత కోసం ఎన్నికల కమిషన్ ఈసారి ప్రయోగాత్మకంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. మూడు కేటగిరీలుగా ప్రతి నియోజకవర్గంలో ఈ స్టేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసిన చోట మహిళలకు 1, యువతకు 2, దివ్యాంగులకు 2 వంతున వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఈ స్టేషన్లను తొలిసారి వినియోగించనున్నారు. ప్రత్యేకించి ఈ బూత్‌ల వద్ద తాగునీరు, ర్యాంపులు, టాయిలెట్లు లాంటి ప్రాథమిక వసతులు కల్పిస్తున్నారు. ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న చోట ఓటు వినియోగించుకోవడంపై రిటర్నింగ్ ఆఫీసర్లు అవగాహన కల్పిస్తున్నారు. స్లిప్పు తీసుకుని లోపలకు వెళ్లి ఓటు ఎలా వేయాలో వివరిస్తున్నారు. అల్లర్లు, అలజడులకు భయపడి ఓటర్లు దూరం కాకుండా ఈ ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. మహిళా కేంద్రాల్లో మహిళా సిబ్బంది మాత్రమే ఎన్నికల విధుల్లో ఉంటారు. ఇతర కేంద్రాల తరహాలోనే ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని అధికారులు వివరించారు.



- తిరుపతి(కలెక్టరేట్)

● మీకు తెలుసా?

ఖైదీలకూ ఓటు

రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాల వల్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా... ఉండదా అనే ప్రశ్న చాలా మంది తలెత్తవచ్చు. అయితే ఖైదీలకు కూడా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. వివిధ నేరాల్లో జైలు శిక్షలు అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయొచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ, తాము ఓటర్లమని, పోలింగ్ బూత్, ఓటరు క్రమసంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాతపూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పిస్తారు.

- చిత్తూరు